తెలంగాణ
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
# ముచ్చట్లు
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
వరంగల్ | సోమవారం-08- డిసెంబర్ 2025 | సంపుటి : 3 | సంచిక : 190 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in




## అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం... ప్రతి హామీ అమలు: మంత్రి పొంగులేటి

- అన్ని వర్గాల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం
- ఆరు గ్యారంటీల అమలుతో సంక్షేమానికి పెద్దపీట
- ఆర్థిక సంక్షోభం నుంచి సంక్షేమ రాష్ట్రంగా మార్పు
- 2035, 2047 లక్ష్యాలతో తెలంగాణ రైజింగ్ విజన్
- భూ సమస్యల తగ్గింపు, ఇందిరమ్మ ఇండ్లు ప్రథమ లక్ష్యం

2లో

## 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025'కు
# అన్నీ సిద్ధం

TELANGANA RISING GLOBAL SUMMIT

- 2047 లక్ష్యంగా 3 ట్రిలియన్ డాలర్ల తెలంగాణ విజన్
- భారత్ ఫ్యూచర్ సిటీలో రెండ్రోజుల గ్లోబల్ సమ్మిట్
- 44 దేశాల నుంచి 2 వేల మంది ప్రతినిధుల హాజరు
- 27 అంశాలపై చర్చలు – విజన్ డాక్యుమెంట్ 2047 ఆవిష్కరణ
- అత్యాధునిక వసతులు, ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు






హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు): దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 2047లో వందేళ్లు పూర్తయ్యే నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025'కు ఏర్పాట్లు పూర్తయ్యాయి. హైదరాబాద్ శివారులోని భారత్ ఫ్యూచర్ సిటీలో సోమ, మంగళవారాల్లో రెండురోజుల పాటు ఈ సదస్సు జరగనుంది. ఇందుకోసం ప్రత్యేకంగా నిర్మించిన ప్రాంగణాన్ని సృజనాత్మకత, డిజిటల్ సాంకేతికత మేళవింపుతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. దేశ విదేశాల నుంచి అతిథులు, ప్రతినిధులు సుమారు 2 వేల మంది ప్రతినిధులు హాజరయ్యే సదస్సు ప్రారంభ వేడుకను రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ..

మిగతా 2లో



## గోవా నైట్‌క్లబ్ అగ్నిప్రమాదంలో
# 25 మంది మృతి

- యజమానులు, మేనేజర్, ఈవెంట్ ఆర్గనైజర్లపై కేసులు
- లైసెన్స్ ఇచ్చిన సర్పంచ్ నిర్బంధం
- భద్రతా నిబంధనల ఉల్లంఘనలపై ప్రాథమిక నివేదిక
- అనుమతులిచ్చిన అధికారులపై చర్యలు తీసుకుంటాం


2లో

## డిసెంబర్ 9ని 'విజయ్ దివస్'గా ఘనంగా
# జరుపుకోవాలని కేటీఆర్ పిలుపు

- డిసెంబర్ 9ను 'విజయ్ దివస్'గా ప్రకటించాలి
- నియోజకవర్గ కేంద్రాల్లోనే కార్యక్రమాలు
- విగ్రహాల పూజలు, పూలమాలల ఆచరణ
- ప్రజా సేవా కార్యక్రమాలు

8లో





## వందేమాతరానికి
# 150 ఏళ్లు

- లోక్‌సభలో వందేమాతరంపై ప్రత్యేక చర్చ
- ప్రధాని మోదీ చేత ప్రారంభం
- చర్చకు 10 గంటల సమయం కేటాయింపు
- రాజ్యసభలో చర్చను ప్రారంభించనున్న అమిత్ షా

న్యూఢిల్లీ , (తెలంగాణ ముచ్చట్లు): జాతీయ గీతం వందేమాతరానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం లోక్‌సభలో ప్రత్యేక చర్చ జరగనుంది. ప్రధాని మోదీ ఈ చర్చను ప్రారంభిస్తారు. పలువురు కేంద్ర మంత్రులు సహా వివిధ పార్టీల సభ్యులు మాట్లాడుతారు. ప్రత్యేక చర్చకు సభలో 10 గంటల సమయం

మిగతా 8లో

## ప్రజా పాలన విజయోత్సవాలపై
# సీఎం స్పష్టత ఇవ్వాలి: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

- రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో సాధించిన విజయాలపై డిమాండ్
- బీఆర్ఎస్ పాలనతో కాంగ్రెస్ పాలనకు తేడా లేదన్న విమర్శ
- ఆరు గ్యారంటీలు, సబ్ గ్యారంటీల అమలుపై ప్రశ్నలు
- భూముల అమ్మకాలు, అవినీతిపై తీవ్ర ఆరోపణలు
- ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమానికి బీజేపీ సన్నాహాలు

8లో




## రాష్ట్రంపై మాట్లాడే నైతిక హక్కు కిషన్‌రెడ్డికి లేదు


- కేంద్ర మంత్రిగా చేసిన సేవలు శూన్యం
- కాంగ్రెస్ పాలనపై ప్రజల మెచ్చుకోలు
- మహాధర్నా పేరిట బీజేపీ రాజకీయాలు
- గ్లోబల్ సమ్మిట్‌పై గర్వంతో ముందుకు

2లో



తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లిపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025'కు
# అన్నీ సిద్ధం



(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డితో కలిసి సోమవారం మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభించనున్నారు.

ఈ అంతర్జాతీయ సదస్సుకు 44 దేశాల నుంచి 154 మంది విదేశీ ప్రతినిధులు హాజరవుతున్నారు. అత్యధికంగా అమెరికా నుంచి 46 దిగ్గజ కంపెనీలకు చెందిన ప్రతినిధులు రానున్నారు. ఫోర్టునేర్-500 కంపెనీల ప్రతినిధులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన ముఖ్యమంత్రులు, మంత్రులు కూడా హాజరయ్యే అవకాశం ఉంది. రెండు రోజుల్లో 27 అంశాలపై చర్చా గోష్టిలు జరుగుతాయి. రెండో రోజు మంగళవారం అత్యంత కీలకమైన 'తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్ 2047'ను ఆవిష్కరిస్తారు. తెలంగాణలో ప్రజాపాలన, పెట్టుబడుల అవకాశాలు, ప్రభుత్వం వైపు నుంచి అందించే సహకారం, విజన్ 2047 డాక్యుమెంట్ లక్ష్యాలు, భారత్ ఫ్యూచర్ సిటీ ఏర్పాటు లక్ష్యాలను సీఎం రేవంత్‌రెడ్డి ఆహూతులకు వివరిస్తారు.

సదస్సు కోసం ఫ్యూచర్ సిటీలో సుమారు 80 ఎకరాల సువిశాల ప్రాంతాన్ని 8 జోన్లు, 33 క్లస్టర్లుగా విభజించి ఏర్పాట్లు చేశారు. 14 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో రెండు ప్రధాన సమావేశ మందిరాలతో పాటు మరో 6 ప్రత్యేక ప్రాంగణాలను చర్చా గోష్టిలు, అతిథులు, ప్రతినిధుల భోజనాల కోసం ఏర్పాటు చేశారు. ప్రధాన సమావేశ మందిరాల్లో 2,500 మంది, సెషన్ హాల్స్‌లో 200 మంది కూర్చునే అవకాశం ఉంది. కాగా సదస్సు ఏర్పాట్లను మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

సదస్సు ఏర్పాట్లు సక్రమంగా ఉన్నదీ లేనిదీ సరిచూసుకునే 'డ్రై రన్'ను ఆదివారం సాయంత్రం అధికారులు విజయవంతంగా నిర్వహించారు. 25 ప్రభుత్వ విభాగాలు 25 రోజుల పాటు కలిసికట్టుగా పనిచేసి చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. విద్యుత్, మంచినీరు, ఇంటర్నెట్, కమ్యూనికేషన్ సేవలు సహా ఏసీలు, 3డీ, ఎల్‌సీడీ ప్రొజెక్టర్లు, లైటింగ్, సౌండ్ సిస్టమ్ తదితరాలు పరీక్షించారు. కాగా దారి పొడవునా సైన్ బోర్డులతో రాక పోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. వీఐపీల కోసం ఏర్పాటు చేసిన మూడు హెలీప్యాడ్‌లు సహా వచ్చి పోయే మార్గాలను తనిఖీ చేశారు.

గ్లోబల్ సమ్మిట్ ప్రాంగణంపై 1,000 సీసీ కెమెరాలు నిరంతరం నిఘా వేసి ఉంచుతాయి. ప్రధాన వేదిక చుట్టూ వెయ్యి మంది పోలీసులతో మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. 33 కిలోమీటర్ల దూరంలో ఉన్న శంషాబాద్ ఎయిర్‌పోర్టు, పీవీ ఎక్స్‌ప్రెస్ హైవే, ఔటర్ రింగు రోడ్డు తుక్కుగూడ ఎగ్జిట్ నుంచి భారత్ ఫ్యూచర్ సిటీ మార్గంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం 1,500 మంది పోలీసులు విధుల్లో పాల్గొంటారు. ఫ్యూచర్ సిటీకి దారి తీసే మార్గాలను పోలీసులు ఇప్పటికే తమ ఆధీనంలోకి తీసుకుని రాకపోకలపై ఆంక్షలు విధించారు. ప్రధాన వేదిక సమీపంలోకి వీఐపీల వాహనాలు మినహా ఇతర వాహనాలను అనుమతించరు.



## అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం... ప్రతి హామీ అమలు: మంత్రి పొంగులేటి

హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):

రాష్ట్రంలోని ఏ వర్గాన్నీ విస్మరించకుండా అభివృద్ధి, సంక్షేమాలకు సమ ప్రాధాన్యమిస్తున్నామని, ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం నెరవేరుస్తోందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సంక్షేమానికి కేరాఫ్ అడ్రస్‌గా కాంగ్రెస్ పాలన నిలుస్తోందని స్పష్టం చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయి మూడో సంవత్సరంలోకి అడుగుపెడుతున్నాం. రెండేళ్ల కాలం తక్కువే అయినా ప్రభుత్వం సాధించిన విజయాలు అత్యద్భుతం.

ధనిక రాష్ట్రాన్ని తమ స్వార్థపూరిత నిర్ణయాలతో పదేళ్లలో దివాలా తీయించి, ఆర్థిక సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని మాకు అప్పగిస్తే రెండేళ్లలోనే సంక్షేమ రాష్ట్రంగా తీర్చిదిద్దాం. ఆరు గ్యారంటీల అమలుకు శ్రీకారం చుట్టాం. ప్రజల సంక్షేమం కోసం పలు పథకాలను అమలు చేశాం. వ్యవసాయ, పారిశ్రామిక రంగాలలో గణనీయమైన ప్రగతిని సాధిస్తున్నాం. తెలంగాణ రైజింగ్ - 2047 విజన్‌తో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోంది'అని అన్నారు.

2035 నాటికి తెలంగాణ ఆర్థిక వ్యవస్థను ఒక ట్రిలియన్ డాలర్ ఎకానమీగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. పాలనలో పారదర్శకత, అభివృద్ధిలో ఆధునికత, సంక్షేమంలో సరికొత్త చరిత్రను రాస్తూ తెలంగాణను రెండేళ్లలో దేశానికి రోల్‌మో డల్‌గా నిలబెట్టామని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో రా ష్ట్రంలో భూ సమస్యలను వీలైనంతవరకు తగ్గించడం, అర్హు లందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడం తమ ప్రభుత్వం ముందున్న ప్రథమ లక్ష్యమని మంత్రి పొంగులేటి వెల్లడించారు.



## గోవా నైట్‌క్లబ్ అగ్నిప్రమాదంలో 25 మంది మృతి

హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):

గోవాలోని బిర్చ్ నైట్ క్లబ్‌లో భారీ అగ్నిప్రమాదం జరిగి 25 మంది ప్రాణాలు కోల్పోవడంపై పోలీసులు తక్షణ చర్యలకు దిగారు. నైట్‌క్లబ్ యజమానులు సౌరభ్ లూత్రా, గౌరవ్ లూత్రాలపై భారతీయ న్యాయసంహితలోని వివిధ సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అర్పోరానాగోవా సర్పంచ్ రోషన్ రెడ్కర్‌ను నిర్బంధంలోకి తీసుకున్నారు.

క్లబ్ మేనేజర్, ఈవెంట్ ఆర్గనైజర్లపై కూడా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్టు సీనియర్ పోలీసు అధికారి ఒకరు తెలిపారు. 2013లో ట్రేడ్ లైసెన్స్ మంజూరు చేసిన రోషన్ రెడ్కార్‌ను అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. అపూర్వ గ్రామంలో నైట్‌క్లబ్ నిర్మాణంలో నిబంధనలు ఉల్లంఘించారని, ఇరుకైన ప్రవేశం మార్గం, తప్పించుకునే మార్గాలు లేకపోవడం, నిర్మాణంలో మండేస్వభావం కలిగిన సామగ్రిని వాడటం వంటివి ప్రమాద కారణాలుగా ప్రాథమిక విచారణలో వెల్లడికావడంతో పోలీసులు తాజా చర్యలకు దిగారు.

భద్రతా నియమాల ఉల్లంఘన జరిగినప్పటికీ క్లబ్ నిర్వహణకు అనుమతించిన అధికారులపై చర్యలు తీసుకుంటామని గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ తెలిపారు. కాగా, అనుమతి లేకుండా నైట్‌క్లబ్ నిర్మాణం జరిగిందని, క్లబ్‌ను కూల్చేవేసేందుకు నోటీసులు జారీ చేసినప్పటికీ దానిపై హైయర్ అథారిటీ స్టే ఇచ్చిందని విలేజ్ అధికారి ఒకరు తెలిపారు. శనివారం అర్ధరాత్రి ప్రమాదం జరిగినప్పుడు నైట్‌క్లబ్‌లో సుమారు 100 మంది వరకూ ఉన్నారని, సిలెండర్ పేలడం వల్ల ప్రమాదం జరిగిందని చెబుతున్నారు. మంటలు చెలరేగగానే పలువురు గ్రౌండ్ ఫ్లోర్ వైపు పరుగులు తీశారని, ప్రవేశద్వారం ఇరుకుగా ఉండటంతో పలువురు వంటగదిలోనే చిక్కుకుపోయారని పోలీసులు చెప్పారు. మృతుల్లో నలుగురు టూరిస్టులు, 14 మంది సిబ్బంది ఉన్నట్టు చెబుతున్నారు.

## రాష్ట్రంపై మాట్లాడే నైతిక హక్కు కిషన్‌రెడ్డికి లేదు



హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):

కేంద్ర మంత్రిగా కిషన్ రెడ్డి తెలంగాణకు చేసింది శూన్యమని, రాష్ట్రం గురించి మాట్లాడే నైతిక హక్కు ఆయన కు లేదని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్ర అభివృద్ధి పట్టని కిషన్‌రెడ్డి ఏ ముఖం పెట్టుకుని మహాధర్నా చేస్తున్నారని మండిపడ్డారు.

అభివృద్ధి, సంక్షేమంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలతో శెభాష్ అనిపించుకుంటోందని, ఇది చూసి ఓర్వలేక బీజేపీ నేతలు మహాధర్నా పేరిట కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీకి డిపాజిట్ దక్కలేదన్న విషయంపై కిషన్‌రెడ్డి ఆలోచించాలన్నారు. గ్లోబల్ సమ్మిట్‌ను గర్వంగా జరుపుకుంటామని స్పష్టం చేశారు.

## పశ్చిమబెంగాల్ రాజకీయ తుఫాన్



పశ్చిమబెంగాల్‌లోని ముర్షీదాబాద్‌లో బాబ్రీ మసీదు తరహాలో మసీదు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన టీఎంసీ సస్పెండెడ్ ఎమ్మెల్యే హుమయూన్ కబీర్ (సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి మమతా బెనర్జీని వచ్చేఏడాది ఎన్నికల్లో నాలుగోసారి ముఖ్యమంత్రిగా అధికారంలోకి రాకుండా చేస్తామని హెచ్చరించారు. తృణమూల్ ముస్లిం ఓటు బ్యాంకు ముగిసిపోతుందని అన్నారు. 'పిక్చర్ అభి బాకీ హై' అంటూ కామెంట్స్ చేశారు.

బెల్డాంగలో ప్రతిపాదిత బాబ్రీ మసీదుకు కబీర్ శనివారంనాడు శంకుస్థాపన చేశారు. ఆయన నుంచి బాబ్రీ మసీదు ప్రకటన వెలువడగానే పార్టీ నుంచి కబీర్‌ను సస్పెండ్ చేస్తున్నట్టు టీఎంసీ ప్రకటించింది. కాగా, డిసెంబర్ 22న కొత్త పార్టీని ఏర్పాటు చేయనున్నట్టు కబీర్ తాజాగా ప్రకటించారు. హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఏఐఎంఐఎం పార్టీతో పొత్తుకు ప్రయత్నిస్తామని చెప్పారు.

వచ్చే ఏడాది జరుగనున్న బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 294 స్థానాలకు గాను 135 చోట్ల తమ అభ్యర్థులను నిలబెడతామని కబీర్ తెలిపారు. రాష్ట్ర రాజకీయాల్లో తమ పార్టీ 'గేమ్ ఛేంజర్' కానుందని చెప్పారు. ముస్లింల కోసం తమ పార్టీ పనిచేస్తుందని, ఐఏఎంఐఎంతో కలిసి ఎన్నికల్లో పోటీ చేస్తామని, ఆ పార్టీతో టచ్‌లో ఉన్నామని తెలిపారు. కాగా, దీనిపై ఏఐఎంఐఎం కానీ, ఒవైసీ కానీ ఇంకా స్పందించలేదు.

బెంగాల్‌లో బీజేపీని అధికారంలోకి రానీయమని, టీఎంసీ సైతం వచ్చే ఏడాది ప్రభుత్వం ఏర్పాటు చేయలేదని కబీర్ చెప్పారు. బాబ్రీ మసీదు తరహాలో మసీదు నిర్మాణంపై మాట్లాడుతూ, దేశంలోని పలు పారిశ్రామిక సంస్థలు తనకు సాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఇండియాలోని ముస్లింల వద్ద చాలా నిధులున్నాయని, బాబ్రీ నిర్మాణానికి వారు సాయం అందించనున్నారని చెప్పారు. మసీదు నిర్మాణం మత ఉద్రిక్తతలను పెంచే ప్రయత్నంగా బీజేపీ విమర్శిస్తుండగా, తాము సెక్యులర్ సిద్ధాంతాలను విశ్వసిస్తామని కబీర్ తెలిపారు. శనివారంనాడు నిర్వహించిన కబీర్ ఫౌండేషన్ 'బాబ్రీ మసీదు' ఈవెంట్‌కు 8 లక్షల మంది హాజరైనట్టు ఆయన చెప్పారు. ఇటుకలు, నగదు రూపంలో విరాళాలు వెల్లువెత్తుతున్నట్టు వెల్లడించారు.

కాగా, పశ్చిమబెంగాల్‌లో మమతా బెనర్జీ టీఎంసీకి ముస్లింలు ప్రధాన ఓటు బ్యాంకుగా ఉన్నారు. మరోవైపు రాష్ట్రంలో బలంగా వేళ్లూనుకోవాలని బీజేపీ పట్టుదలగా ఉంది. 2021 ఎన్నికల్లో గతంలో ఎన్నడూ లేనంత బలీయమైన శక్తిగా బీజేపీ నిలిచింది. అయితే ప్రతికూలతలు ఉన్నప్పటికీ 2021 ఎన్నికల్లో మూడింట రెండు వంతుల మెజారిటీతో తృణమూల్ గెలిచింది.

## ట్రావెల్ కష్టాలకు ప్రత్యామ్నాయంగా సోమవారం ప్రత్యేక రైళ్లు



ఇండిగో సంక్షోభం ఆరో రోజైన ఆదివారం నాడు కూడా కొనసాగుతుండటం, 650 విమానాలు రద్దుకావడంతో దేశవ్యాప్తంగా వేలాది మంది ప్రయాణికులు పలు విమానాశ్రయాల్లో చిక్కుకుపోయారు. బాధిత ప్రయాణికులకు ఆదుకునేందుకు ఇండియన్ రైల్వే రంగంలోకి దిగింది. అత్యవసర చర్యలు చేపట్టింది. అత్యధికంగా డిమాండ్ ఉన్న రూట్లలో ప్రత్యేక రైళ్లను నడపనుంది. ప్రత్యేక రైళ్లు సాధ్యంకాని రూట్లలో ప్రస్తుతం ఉన్న రైళ్లకు అదనపు కోచ్‌లను చేర్చనుంది. ఇందులో భాగంగా సోమవారంనాడు పలు రూట్లలో ప్రత్యేక రైళ్ల సేవలను అందిస్తున్నట్టు ఈశాన్య సరిహద్దు రైల్వే ప్రకటించింది.

వివిధ రూట్లలో పలు క్లాసులకు అదనపు బోగీలను చేరుస్తున్నట్టు ఎన్ఎఫ్ఆర్ సీపీఆర్ఓ కపింజల్ కిషోర్ శర్మ తెలిపారు. ఇండిగో విమానాల రద్దు దృష్ట్యా ఈ చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. సోమవారంనాడు రెండు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నామని, ఒక రైలు డిబ్రూగఢ్ నుంచి న్యూఢిల్లీ వరకూ, మరో రైలు గౌహతి నుంచి హౌరా వరకూ వెళ్తుందని చెప్పారు. దీనికి అదనంగా ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు 18 వేర్వేరు రైళ్లను నడుపుతున్నామని చెప్పారు. వివిధ సెక్టార్లలో ఈ రైళ్లు నడుస్తాయని అన్నారు. ఈ ప్రత్యేక రైళ్ల గురించి మరింత సమాచారం కోసం సమీపంలోని రైల్వే స్టేషన్లను కానీ ఇండియన్ రైల్వే హెల్ప్‌లైన్ నంబర్ 139కు కానీ ఫోన్ చేయవచ్చు. ఏ ట్రైన్‌కు అదనపు బోగీలను చేర్చారనే సమాచారం కూడా తెలుసుకోవచ్చు.

### 89 ప్రత్యేక రైళ్లు

కాగా, రాబోయే మూడు రోజుల్లో అన్ని జోన్లలో 89 ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్టు భారతీయ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. న్యూఢిల్లీ, ముంబై, చెన్నై, బెంగళూరు, పాట్నా, హౌరా తదితర ప్రధాన నగరాల్లోని రైళ్ల రద్దీ పరిస్థితిని విశ్లేషించిన రైల్వే మంత్రిత్వ శాఖ ఈ సత్వర చర్యలు తీసుకుంది. సెంట్రల్ రైల్వే 14, నార్తర్న్ రైల్వే 10 ప్రత్యేక రైళ్లను నడిపేందుకు ప్లాన్ చేసింది. పరిస్థితులను సమీక్షించి అవసరమైతే మరిన్ని రైళ్లను కూడా నడపనుంది. ఇతర జోన్‌లు కూడా తమ షెడ్యూల్‌తో పాటు ప్రత్యేక రైళ్లకు సంబంధించి నోటిఫికేషన్లు జారీచేశాయి.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక







# చిలుకటోనీ పల్లి అభివృద్ధే లక్ష్యం.. సర్పంచ్ అభ్యర్థి పద్మా లింగేశ్వర్

- **దూకుడుగా ప్రచారం ఫుట్‌బాల్ గుర్తుకు ఊహించని ప్రజాదరణ.. ఎమ్మెల్యే సహకారంతో విజయం సాధిస్తా..**

**పెద్దమంద,డిసెంబర్07(తెలంగాణ ముచ్చట్లు):** చిలుకటోనీ పల్లి గ్రామంలో సర్పంచ్ ఎన్నికల వేడి రోజు రోజుకు పెరుగుతోంది. అభ్యర్థి పద్మా లింగేశ్వర్ ఇంటింటి ప్రచారంతో దూకుడు పెంచి ప్రజల మధ్య విస్తృతంగా చర్చనీయాంశంగా మారుతున్నారు. ఆదివారం వెల్టూర్ గ్రామంలో ఎమ్మెల్యే మేఘా రెడ్డిని కలిశారు. ఇంటింటా ప్రచారంలో ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించే విధంగా కృషి చేస్తామని, కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని పద్మలింగేశ్వర్ కు ఎమ్మెల్యే సూచించారు. గ్రామాభివృద్ధిని ప్రధాన అజెండాగా తీసుకున్న పద్మా లింగేశ్వర్, ఫుట్ బాల్ గుర్తుకు ఓటు వేయాలని గ్రామస్తులను కోరుతున్నారు.ప్రచారానికి ఊహించని విధంగా వచ్చిన ప్రజాదరణతో పద్మా లింగేశ్వర్ హుషారులో ఉన్నారు.ప్రతి గడప వద్ద ప్రజలు చూపుతున్న ఆదరణ, విశ్వాసం తనకు గెలుపు సంకేతాలు ఇస్తోందని ఆయన పేర్కొన్నారు.గ్రామ అభివృద్ధి, పారదర్శక పాలన, ప్రజల సమస్యలను ప్రాధాన్యంగా పరిష్కరించే దిశగా పనిచేయాలని సంకల్పం వ్యక్తం చేస్తూ, ఎమ్మెల్యే మేఘా రెడ్డి అండగా ఉన్నందున విజయం తనవైపే అని ధీమా వ్యక్తం చేశారు.చీలకటోనీ పల్లిలో ఎన్నికల వేడి పెరగడంతో ప్రచార రంగంలో పద్మా లింగేశ్వర్ పేరు పెనుమార్మ్రులు తెస్తోంది. ప్రజల మద్దతుతో, ఎమ్మెల్యే మేఘా రెడ్డి సహకారంతో గెలుపు ఖాయం అని పద్మ లింగేశ్వర్ విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.





# ప్రైవేటు పాఠశాలల సంఘంలో నూతన కార్యవర్గం.!

**డివిజన్ అధ్యక్షుడిగా మరోసారి పసుపులేటి నాగేశ్వరరావు ఏకగ్రీవం**

**సత్తుపల్లి, డిసెంబర్ 7 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల సంఘం సత్తుపల్లి డివిజన్ నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం స్వామి వివేకానంద హ్యూమన్ ఎక్సలెన్సీ భవనం ల్లో సజావుగా జరిగాయి. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షుడిగా విశ్వశాంతి విద్యాలయం ప్రతినిధి పసుపులేటి నాగేశ్వరరావును మరోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా శాంతినికేతన్ స్కూల్‌కు చెందిన పాలకొల్లు శ్రీనివాసరావు, శ్రీ సత్య సాయి విద్యానికేతన్‌కు చెందిన గొబ్బూరి నాగరాజు ఎంపికయ్యారు. కార్యదర్శిగా లక్ష్యా స్కూల్‌కి చెందిన ఈశ్వర్, కోశాధికారిగా గీతాంజలి స్కూల్‌కి చెందిన చీకటి శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. సంయుక్త కార్యదర్శులుగా చైతన్య స్కూల్‌కు చెందిన ఎదుళ్ల మురళీకృష్ణ, సరస్వతి స్కూల్‌కు చెందిన జుజ్జూరి చెన్నారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ప్రతిభా స్కూల్ నిర్వాహకుడు లక్కినేని ప్రసాద్, గౌరవ సలహాదారులుగా కేపిఆర్ గౌతమ్ మోడల్ స్కూల్‌కు చెందిన మందపాటి ప్రభాకర్ రెడ్డి, సెంచరీ స్కూల్‌కు చెందిన కృష్ణారావు నియమితులయ్యారు. ఎన్నికలను సంఘ జిల్లా కార్యదర్శి నాయుడు వెంకటేశ్వరరావు, రాష్ట్ర బాధ్యులు ఇస్మాయిల్, లక్కినేని ప్రసాద్ పర్యవేక్షించారు. సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి, కల్లూరు మండలాలకు చెందిన అనేక ప్రైవేటు విద్యాసంస్థల ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు.






# నందు బ్యాటరీ షాప్‌ను ప్రారంభించిన పరమేశ్వర్ రెడ్డి

**మల్లాపూర్, డిసెంబర్ 07 (తెలంగాణ ముచ్చట్లు):** మల్లాపూర్ మెయిన్ రోడ్డులో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు పర్వతాలు ఏర్పాటు చేసిన 'నందు బ్యాటరీ షాప్' ను ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి ఆదివారం రోజు ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... స్థానిక యువత వ్యాపార రంగంలో ముందుకు రావడం అభినందనీయమని, ఈ తరహా స్థానిక వ్యాపారాల అభివృద్ధికి పార్టీ ఎల్లప్పుడూ తోడ్పాటు అందిస్తుందని తెలిపారు.ఈకార్యక్రమంలో మల్లాపూర్ డివిజన్ అధ్యక్షులు కప్పర సాయి కిరణ్ గౌడ్, నాయకులు నెమలి అనిల్, ఎస్.వి. కిట్టు, దంటూరి రాజు, మెరుపుల బాలరాజ్, కోయగూర బాలరాజ్, జానీ భాయ్, శ్రీనివాస్, మనోహర్, సాయి, ప్రవీణ్, వినోద్, మధు, జయంత్, నాగ, ఫిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# మోజర్ల బిఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి నర్సింహారెడ్డి ఇంటింటి ప్రచారం

**పెద్దమందడి,డిసెంబర్07(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం మోజర్ల బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి నర్సింహారెడ్డి శనివారం గ్రామంలో విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి వాడ, ప్రతి ఇంటిని సందర్శిస్తూ ప్రజల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధే మా లక్ష్యం. మేము చేసిన పనులను ప్రజలు గుర్తించి ఆశీర్వదిస్తున్నారని అనిపిస్తోంది. మౌలిక వసతుల అభివృద్ధి, శుద్ధి నీటి సరఫరా, రహదారుల మరమ్మతులు, గ్రామంలోని ప్రతి కుటుంబం అభ్యున్నతికి బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న సంకల్పం ప్రజల ముందే ఉంది అని పేర్కొన్నారు.ఇదే సందర్భంగా గ్రామ ప్రజలు తమ సమస్యలను అభ్యర్థికి వివరించగా, అవి పరిష్కారమయ్యేలా కృషి చేస్తామని నర్సింహారెడ్డి హామీ ఇచ్చారు. ప్రచార కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# మర్రిపెల్లి అనిత అభ్యర్థిత్వాన్ని బలపరిచిన జనసేన



**ధర్మసాగర్,డిసెంబర్07(తెలంగాణ ముచ్చట్లు):** ధర్మసాగర్ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా పోటీలో ఉన్న విద్యావంతురాలు మర్రి పెల్లి అనిత విజయ్ కుమార్ అభ్యర్థిత్వాన్ని జన సేనపార్టీ తరుపున బలపరుస్తున్నట్లు పార్టీ నియోజకవర్గం ఇంచార్జ్ గాదె పృథ్వీ ప్రకటించారు. మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయాలని నిస్వార్థంగా ముందుకు వచ్చిన సామాన్య గృహిణి, చదువుకున్న మహిళ మర్రిపెల్లి అనితను గెలిపించాలని కోరారు.సామాన్యులకు ఎల్లప్పుడూ జనసేనపార్టీ అండగా ఉంటుందన్నారు.యువతతో పార్టీ సంస్థగతంగా బలపడుతుందని వ్యాఖ్యనించారు. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న అనితకు జనసేనపార్టీ తోడుగా ఉంటుందన్నారు.జనసైనికులు మర్రిపెల్లి అనిత గెలుపుకు కృషి చేయాలని ఆదేశించారు.వార్డు సభ్యురాలిగా సేవలందించి ప్రజల మన్నెలు పొందిన అనితను గ్రామ సర్పంచ్‌గా అత్యంత మెజారిటీతో గెలిపించి గ్రామ అభివృద్ధికి తోడ్పాడాలన్నారు. గ్రామ ప్రజలు చదువుకున్న వ్యక్తులను రాజకీయాల్లో ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు.

# బాబాసాహెబ్ అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా సంతాప సభ



**ఏ ఎస్ రావు నగర్, డిసెంబర్ 07 (తెలంగాణ ముచ్చట్లు):** పూలే-అంబేద్కర్ స్ఫూర్తి గ్రూప్ ఎన్ఎఫ్సీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి 7 గంటలకు కమలా నగర్ సిఐటియు ఆఫీస్ ప్రాంగణంలో బాబాసాహెబ్ అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా సంతాప సభ మరియు అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన కర్తవ్యం పై చర్చ కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమాన్ని పూలే అంబేద్కర్ స్ఫూర్తి గ్రూపు ఎన్ఎఫ్సీ నిర్వాహకులు గోవిందు అధ్యక్షతన నిర్వహించారు. ఎన్ఎఫ్సీ సీనియర్ ఆఫీసర్ మల్లేశం, లక్ష్మయ్య, సామాజిక ఉద్యమ నేత కోమటి రవి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.కే. మల్లేశం మాట్లాడుతూ, అంబేద్కర్ భారత రాజ్యాంగాన్ని రచించిన విధానం ప్రత్యేకమని, అది అలనాటి మనువాద నిచ్చెనలకు భిన్నంగా, "మానవులందరూ ఒకటే" అనే సూత్రాన్ని ప్రాతిపదికగా తీసుకున్నట్లు గుర్తుచేశారు. విద్యను అందించడం, సమాన అవకాశాలు కల్పించడం కోసం ఎస్సీ-ఎస్టీ వర్గాలకు రిజర్వేషన్ల ద్వారా అనేక మంది అభివృద్ధి సాధించారని ఆయన పేర్కొన్నారు. సామాజిక ఉద్యమ నేత రషీద్, నల్లమల అడవుల్లో చెంచుల జీవన పరిస్థితులను పరిశీలించి వీడియోలు తీసి, వారి బతుకుల పరిస్థితులు నేటికీ దుర్భరంగా ఉన్నట్లు వివరించారు. గొడుగు యాదగిరిరావు, లక్ష్మయ్య, ఎం. భాస్కర్ రావు, సురేష్, గోవిందు తదితరులు ప్రసంగాలు చేశారు. అనంతరం సురేష్ వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.

# గట్ల ఖానాపూర్ బిఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి లక్ష్మి శ్రీనివాస్ తరుపున



**పెద్దమందడి,డిసెంబర్07(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం గట్ల ఖానాపూర్ గ్రామంలో బిఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి లక్ష్మి శ్రీనివాస్ తరుపున బి.ఆర్.ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి గ్రామస్థుల సమస్యలు, అవసరాలు తెలుసుకొని వాటి పరిష్కారానికి తన కట్టుబాటును వ్యక్తం చేశారు.ప్రచారం సమయంలో లక్ష్మి శ్రీనివాస్ గ్రామ అభివృద్ధి, తాగునీటి సదుపాయాలు, రోడ్లు, విద్యా, మహిళా సంక్షేమం, యువతకు ఉపాధి అవకాశాల పెంపు వంటి అంశాలపై తన ప్రణాళికలను వివరించారు. ప్రజలకు స్వచ్ఛందంగా, సమగ్ర అభివృద్ధి కోసం తమ లక్ష్యాలను వివరించి, ఫుట్ బాల్ గుర్తుతో ఓటు వేయి, గెలిచేలా చేయండి అని కోరారు.ప్రచారంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ప్రజల మద్దతుతోనే విజయం సాధిస్తానని లక్ష్మి శ్రీనివాస్ ధీమాగా పేర్కొన్నారు. స్థానికులు ఇంటింటా ప్రచారం ద్వారా ఆమె ప్రణాళికలను గ్రహించి, అభ్యర్థి పై విశ్వాసం వ్యక్తం చేశారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లిపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# సఫిల్గూడ ఆర్‌యూబీ కి రూ.12 కోట్లు నిధులు మంజూరు

## ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికి కృతజ్ఞత సభ

**మల్కాజ్గిరి, డిసెంబర్ 07 (తెలంగాణ ముచ్చట్లు):** మల్కాజ్గిరి మాజి కార్పొరేటర్ నిరుగొండ జగదీష్ గౌడ్ ఆధ్వర్యంలో శాసన సభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి కి కృతజ్ఞత సభ సఫిల్గూడ స్టేషన్ పరిసరాల్లో ఘనంగా జరిగింది. సఫిల్గూడ ఆర్‌యూబీ కి రూ.12 కోట్లు శాంక్షన్ చేయడంలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ సభలో బల్రామ్ నగర్, సీతారాం నగర్, కృష్ణ నగర్, దేవి నగర్, చాణిక్యపురి కాలనీ తో పాటు సఫిల్గూడకు సమీపంలో ఉన్న కాలనీల వాసులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పరశురాం రెడ్డి, మండల్ రాధాకృష్ణ, కిషోర్ సింగ్, రామకృష్ణ, సోమసుందర్, ముర్గేష్, శ్రీనివాస్ గౌడ్, గోపాల్ సింగ్, వెంకటేష్ ఆర్మీ, అద్వైత్ కుమార్, సంతోష్, సజయ్, రవీంద్ర, పి.ఎస్.శ్రీనివాస్, గణేష్, సుధా, సతీష్, కోటేష్, శ్రీకాంత్, కిరణ్, రాజేశ్ గౌడ్, వేణు యాదవ్, నవీన్, రజని గౌడ్, జ్ఞానేష్, ఇబ్రహీం, శ్రీకాంత్ యాదవ్, హేమంత్ పటేల్, హేమంత్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.ప్రాంతాభివృద్ధి కార్యక్రమాలకు శాసనసభ్యుడు మద్దతు అందిస్తున్నారని, ఇదే ఉత్సాహంతో మల్కాజ్గిరి అభివృద్ధి కొనసాగుతుందనే నమ్మకం వ్యక్తం చేశారు నేతలు.





# భవానీనగర్‌లో జనం బాట కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ కవిత

**నాగారం, డిసెంబర్ 07 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్ జిల్లా నాగారం గ్రేటర్ పరిధిలోని రాంపల్లి చౌరస్తా భవానీనగర్‌లో జన జాగృతి సమితి అధ్యక్షులు కల్వకుంట్ల కవిత జాగృతి జనం బాట కార్యక్రమాన్ని చేపట్టారు.
స్థానికులు ప్రధానంగా మురికికాలువ సమస్య తీవ్రంగా ఉందని, సాయంత్రం అయ్యేసరికి దుర్వాసనతో డోర్లు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంటోందని కవితకు వాపోయారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటుతో సమస్య కొంతవరకు పరిష్కారం అవుతుందని వాసులు కోరారు. సమస్య పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని కవిత హామీ ఇచ్చారు.అలాగే భవానీనగర్ కాలనీలో బస్తీ దవాఖాన, ప్రాథమిక పాఠశాల ఏర్పాటు అవసరం ఉందని ప్రజలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మికులకు గుర్తింపు కార్డులను కవిత అందజేశారు. మిగిలివున్న వారికి కూడా ఉచితంగా కార్డులు పంపిణీ చేయనున్నట్లు మహిళా నాయకురాలు భవానీ తెలిపారు. కవిత అనంతరం జవహర్‌నగర్ డంపింగ్ యార్డును కూడా పరిశీలించారు. గ్రీన్ ట్రిబ్యునల్ తీర్పును అమలు చేయకుండానే రాంకీ సంస్థ కార్యకలాపాలు కొనసాగుతున్నందున స్థానికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రజలు కవిత దృష్టికి తీసుకువచ్చారు. సమస్య పరిష్కారానికి ఎంతవరకైనా పోరాడుతానని కవిత భరోసా ఇచ్చారు.ఈకార్యక్రమంలో వెంకటేశ్, నాగారం అధ్యక్షులు ఎత్తరి గణేష్, జన జాగృతి సమితి మహిళా నాయకురాళ్లు లలిత, భవానీ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజాపాలనకు ప్రథమ ధ్యేయం

**నెమలి అనిల్ కుమార్**

**మల్లాపూర్, డిసెంబర్ 07 (తెలంగాణ ముచ్చట్లు):** మల్లాపూర్ డివిజన్ స్వామి వివేకానంద నగర్ కాలనీ ఫేజ్-3లో "బస్తీ బాట" కార్యక్రమం భాగంగా పర్యటించిన గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్, కాలనీ ప్రజలతో సమావేశమై సమస్యలను తెలుసుకున్నారు.కాలనీలో తాగునీరు, డ్రైనేజ్, వీధి దీపాల వంటి అంశాలను కాలనీ వాసులు వివరించగా, వాటి పరిష్కారానికి తమవంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలు తెలుసుకొని వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లడం ద్వారానే ప్రజలకు నిజమైన ప్రజాపాలన అందుతుందని అన్నారు. ఉప్పల్ కాంగ్రెస్ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి సహకారంతో పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కారమయ్యేలా కృషి చేస్తామని నెమలి అనిల్ కుమార్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు సానాల రవికుమార్, ప్రధాన కార్యదర్శి పైళ్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు పల్లె శివగౌడ్, సంయుక్త కార్యదర్శులు పైళ్ల గౌతమ్, అరుణ్‌కుమార్, సభ్యులు రాములు గౌడ్, దయాకర్, నవీన్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ అభ్యర్థి మధిర మంజుల శ్రీశైలం తరపున ఎమ్మెల్యే ప్రచారం

**పెద్దమందడి,డిసెంబర్07(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి గ్రామంలో సర్పంచ్ అభ్యర్థి మధిర మంజుల శ్రీశైలం తరపున ఎమ్మెల్యే మేఘా రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రసంగంలో ఎమ్మెల్యే గ్రామ అభివృద్ధి అంశాలపై దృష్టి సారించారు. ముఖ్యంగా తాగునీటి సమస్యలు, అంతర్గత రహదారుల మరమ్మతులు, మురుగు నీటి పారుదల వ్యవస్థ, విద్యా మరియు ఆరోగ్య సౌకర్యాల విస్తరణ వంటి అంశాలను ప్రస్తావించారు.అభ్యర్థి గ్రామస్తులతో కలిసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తారని, గ్రామ అభివృద్ధి కార్యక్రమాల్లో సక్రమంగా వ్యవహరిస్తారని ఎమ్మెల్యే తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన పామిరెడ్డిపల్లి సర్పంచ్ అభ్యర్థి మధిర మంజుల శ్రీశైలంను బ్యాట్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే ప్రచారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# మాక్రో మీడియా డిజిటల్ ఎంపిఎల్ క్రికెట్ టోర్నమెంట్ విజయవంతం

**కీసర, డిసెంబర్ 07 (తెలంగాణ ముచ్చట్లు):** మాక్రో మీడియా డిజిటల్ ఇమేజింగ్ సంస్థలో ఉద్యోగుల ఉత్సాహానికి, టీమ్ స్పిరిట్‌కు నిలువెత్తు నిదర్శనంగా ఎంపిఎల్ క్రికెట్ లీగ్‌ను సంస్థ నిర్వహించింది.ఈ టోర్నమెంట్‌లో వివిధ విభాగాలకు చెందిన ఉద్యోగులు చురుకుగా పాల్గొని తాము కలిగిన క్రీడాస్ఫూర్తిని చాటుకున్నారు.సంస్థ డైరెక్టర్లు శ్రీ రామకృష్ణ, శ్రీ నరేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ లీగ్ గేమ్స్‌లో అన్ని జట్లు పరస్పరం పోటీ పడుతూ వినోదాత్మకంగా సాగాయి. ఎంపిఎల్ నిర్వహణ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నిర్వాహక కమిటీ సక్రమంగా ఏర్పాట్లు చేసి ఈ క్రీడా కార్యక్రమాన్ని విజయవంతం చేసింది.ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ— "ఉద్యోగ విరామంలో వినోదంతో పాటు ఆరోగ్యానికి దోహదపడే ఈ రకమైన కార్యక్రమాలు మాకు కొత్త ఉత్సాహాన్ని కలిగిస్తాయి. ఈ అద్భుతమైన అవకాశాన్ని అందించినందుకు నిర్వాహకులకు కృతజ్ఞతలు" అని తెలిపారు.మేనేజింగ్ డైరెక్టర్లు తమ బిజీ షెడ్యూల్ మధ్య కూడా ఛాంపియన్‌షిప్ మ్యాచ్‌లు ప్రత్యక్షంగా వీక్షించి ఉద్యోగులకు ప్రోత్సాహం ఇచ్చినందుకు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.క్రికెట్ లీగ్ ముగింపులో విజేత జట్లకు ట్రోఫీలతో పాటు ప్రత్యేక మొమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో ఉద్యోగులందరూ భాగస్వామ్యం అవుతూ ఉత్సాహభరిత వాతావరణాన్ని సృష్టించారు.



# పామిరెడ్డిపల్లి గ్రామ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

**కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి మధిర మంజుల శ్రీశైలం**

**పెద్దమందడి,డిసెంబర్07( తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి గ్రామ అభివృద్ధిని కాంగ్రెస్ నాయకత్వంతోనే సాధ్యమని ప్రజల్లో బలమైన నమ్మకం నెలకొల్పుతూ, సర్పంచ్ అభ్యర్థి మధిర మంజుల శ్రీశైలం ముమ్మర ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు, అవసరాలు తెలుసుకుని వాటికి తక్షణ పరిష్కారం తీసుకురావడానికి కట్టుబడి ఉంటానని మంజుల హామీ ఇచ్చారు.గ్రామ అభివృద్ధి, పారిశుద్ధ్యంపై దృష్టి, తాగునీటి సదుపాయాల మెరుగుదల, మహిళా సంక్షేమం, యువతకు ఉపాధి అవకాశాల పెంపు వంటి అంశాలను కాంగ్రెస్ పాలనలో సాధించవచ్చని మంజుల శ్రీశైలం వివరించారు.ప్రజల మద్దతు, ఎమ్మెల్యే సహకారంతో ఎన్నికల్లో విజయం సాధిస్తానని ధీమాగా మధిర మంజుల శ్రీశైలం వ్యక్తం చేశారు. స్థానికులు, గ్రామ పెద్దలతో కలిసి ఇంటింటి ప్రచారం ద్వారా మంచి స్పందనను పొందుతున్నట్లు ఆమె తెలిపారు.ఎన్నికల్లో విజయం సాధించిన వెంటనే గ్రామ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణలు చేపడతానని మంజుల శ్రీశైలం హామీ ఇచ్చారు. ప్రచార కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# సోమేశ్వర టెక్స్టైల్స్ అసోసియేషన్ వారి ఘన సన్మానం

**అధ్యక్షులు : గోరంట్ల కుమారస్వామి**
**ప్రధాన కార్యదర్శి : వన్నాల ప్రకాష్**

**పాలకుర్తి, తెలంగాణ ముచ్చట్లు :** అఖిల భారత పద్మశాలి యువజన సంఘం నిర్వహించిన కార్యక్రమంలో ఈరోజు ముఖ్య అతిథిగా అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షులు కందగట్ల స్వామి, అఖిల భారత యువజన సంఘం అధ్యక్షులు శ్రీనివాస్ కిషోర్ సంఘ సూరత్ కి వచ్చిన సందర్భంగా సోమేశ్వర టెక్స్టైల్ అండ్ మ్యానుఫ్యాక్చరర్ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గోరంట్ల కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి వన్నాల ప్రకాష్ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జనరల్ సమాజం అధ్యక్షులు దాసరి శ్రీనివాస్, సభ్యులు కోట సాగర్, చిల్కమారి సాయిప్రసాద్, కైరం కొండ సురేందర్, జిగిజర్ల రమేష్, కైరం కొండ సత్యనారాయణ, సామల శ్రీనివాస్, కోట అంబదాసు, కుసుమ అశోక్, వెంగల్ దాస్ రవి, పెంటి సంజయ్, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక




# చిల్కానగర్ ఎంపిపిఎస్ ప్రభుత్వ పాఠశాలకు నిధులు కేటాయించండి

## కార్పొరేటర్ బన్నాల

**చిల్కానగర్, డిసెంబర్ 07 (తెలంగాణ ముచ్చట్లు) :** ఉప్పల్ నియోజకవర్గ చిల్కానగర్ ఎంపిపిఎస్ ప్రభుత్వ పాఠశాలకు అదనపు గదుల నిర్మాణం కోసం తక్షణం నిధులు కేటాయించాలని కోరుతూ చిల్కానగర్ కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ శనివారం రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ నవీన్ నికోలస్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, 2024 డిసెంబర్‌లో అప్పటి డైరెక్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ నరసింహారెడ్డిని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలిసి కలసి అదనపు గదుల నిర్మాణానికి సంబంధించిన వినతిపత్రం సమర్పించిన విషయాన్ని పేర్కొన్నారు. ప్రాతినిధ్యాలకు సంబంధించిన పత్రాలను కూడా డైరెక్టర్‌కి అందజేశారు.ప్రస్తుతం పాఠశాల భవనం శిథిలావస్థలోకి చేరడంతో పాటు విద్యార్థులు తరగతి గదుల కొరతతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారని గీతా ప్రవీణ్ వివరించారు. వెంటనే నిధులు కేటాయించి పాఠశాల భవనం మరమ్మతులు మరియు అదనపు గదుల నిర్మాణం చేపట్టాలని కోరారు.దీనిపై డైరెక్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ నవీన్ నికోలస్ సానుకూలంగా స్పందిస్తూ, ఈ ఆర్థిక సంవత్సరంలో కచ్చితంగా నిధులు కేటాయించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు కార్పొరేటర్ తెలిపారు.



# తిరుమలాయపాలెం మండలంలో ఎన్నికల నేపథ్యంలో ముందస్తు చర్యలు..

- **700 మందికి పైగా బైండోవర్.. తహసిల్దార్ ముందు హాజరు పరిచిన ఎస్సై జగదీష్.**

**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 7,తెలంగాణ ముచ్చట్లు;** జరుగుతున్న గ్రామపంచాయతీ ఎన్నికలు శాంతియుతంగా సాగేందుకు పోలీసులు విస్తృత భద్రతా చర్యలు చేపట్టారు. ఎన్నికల సమయంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు మండల పరిధిలో అనుమానాస్పద వ్యక్తులు, సమస్య సృష్టించే అవకాశం ఉన్నవారిపై ముందస్తు చర్యలు తీసుకున్నారు.ఈ క్రమంలో ఇప్పటివరకు మొత్తం 700 మందికి పైగా వ్యక్తులను మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ సమక్షంలో బైండోవర్ చేసినట్టు తిరుమలాయపాలెం ఎస్సై కూచిపూడి జగదీష్ తెలిపారు. వీరిలో300 మంది బెల్ట్ షాప్ నిర్వాహకులు,300 మంది రాజకీయ నాయకులు,100 మంది ట్రబుల్ మేకర్స్,12 మంది రౌడీషీటర్లు,25 మంది సస్పెక్ట్ షీటర్లు, 45 మంది సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూప్ అడ్మిన్‌లు ఉన్నారని చెప్పారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు గ్రామాల్లో ఎవరైనా గొడవలు లేదా శాంతి భద్రతలకు భంగం కలిగించే చర్యలకు పాల్పడిన పక్షంలో వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, వారి మీద కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.ఎన్నికలు ప్రశాంతంగా సాగేందుకు మండల ప్రజలందరు సహకరించాలని ఆయన కోరారు.


# 25 కి.మీ దూరమైనా.. హెలికాప్టర్‌లో వెళ్లి శుభలేఖ

పక్క ఊళ్లో ఉన్నా సరే.. నేరుగా ఇంటికెళ్లి పెళ్లి కార్డు ఇవ్వకుండా కొందరు వాట్సాప్‌లోనే పంపి ఆహ్వానిస్తున్న రోజులివి! కానీ, ఓ మహిళ మాత్రం తన కొడుకు పెళ్లికి.. హెలికాప్టర్‌లో వచ్చి తన అన్నదమ్ములను ఆహ్వానించింది. పుట్టింటికి, మెట్టింటికి మధ్య దూరం 25కి.మీ మాత్రమే అయినా.. ఆ ఆహ్వానం ఎప్పటికీ గుర్తుండిపోయేలా వారిని ఆశ్చర్యపరిచేందుకే ఇలా చేసింది. ఈ ఘటన హరియాణాలోని గురుగ్రామ్ సమీపంలో జరిగింది. పింకీ అనే మహిళ తన కుమారుడు రోహిత్ దహియా వివాహ ఆహ్వానం అతడి మేనమామలకు ఎప్పటికీ గుర్తుండిపోయేలా చేయాలనుకున్నారు. అందుకే దూరం తక్కువైనా సరే హెలికాప్టర్‌లో వెళ్లి శుభలేఖ ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. హెలికాప్టర్‌ను అద్దెకు తీసుకొని.. భౌదా ఖుర్ద్ గ్రామంలోని తన పుట్టింటి ముందే ల్యాండ్ అయ్యారు. దీంతో ఆశ్చర్యపోయిన ఆమె తల్లిదండ్రులు, సోదరులు ఒకింత భావోద్వేగానికి గురయ్యారు. పుష్పగుచ్ఛాలతో ఆమెకు స్వాగతం పలికారు. హెలికాప్టర్‌ను చూసేందుకు ఆ గ్రామంలోని వారంతా గుమిగూడారు. దీంతో అక్కడ సందడి వాతావరణం నెలకొంది. కొద్దిసేపు పుట్టింట్లో గడిపిన పింకీ.. డిసెంబర్ 11న జరగబోయే తన కుమారుడి వివాహానికి ఈ తరహాలో తన సోదరులను ఆహ్వానించడం చర్చనీయాంశంగా మారింది.

# సిఎం రేవంత్ రెడ్డికి వినతిపత్రం అందజేసిన

## బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ శ్రీనివాస్

**నర్సంపేట,డిసెంబర్07(తెలంగాణ ముచ్చట్లు):** వరంగల్ జిల్లా నర్సంపేటలో జరిగిన ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా స్థానిక శాసనసభ్యుడు దొంతి మాధవరెడ్డి సమక్షంలో బీసీ సంక్షేమ సంఘం వరంగల్ అధ్యక్షుడు, నర్సంపేట నియోజకవర్గ ఇంచార్జ్, బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని కలిసి 42 శాతం బీసీ రిజర్వేషన్ల పెంపుకు సంబంధించి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా డ్యాగల శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీల ఆకాంక్షలను గౌరవిస్తూ సాధారణ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన కామారెడ్డి ప్రకటనలో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని బాధ్యత వహించినట్లు గుర్తు చేశారు. అయితే రిజర్వేషన్లు పెంచకుండా గ్రామ సర్పంచ్ ఎన్నికలకు ప్రభుత్వం వెళ్లడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు.



జెడ్పిటిసి, ఎంపిటిసి, కౌన్సిలర్ స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు 42 శాతం రిజర్వేషన్లు అమలు కావాలంటే పార్లమెంటులో రాజ్యాంగ సవరణ అవసరమని, ఇందుకోసం అన్ని రాజకీయ పార్టీల అఖిల పక్ష బృందాన్ని ప్రధాని వద్దకు తీసుకువెళ్లి తొమ్మిదో షెడ్యూలులో బీసీ రిజర్వేషన్ల చేర్పుకు చర్యలు తీసుకోవాలని ఆయన ముఖ్యమంత్రిని కోరారు.
ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నాయకత్వంలో పార్లమెంటు బృందం ఏర్పడి 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టే విధంగా కాంగ్రెస్ పార్టీ ముందడుగు వేయాలని కూడా వినతిపత్రంలో అభ్యర్థించినట్లు తెలిపారు. కామారెడ్డి ప్రకటనలో ఇచ్చిన హామీ ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసి రాష్ట్ర ప్రభుత్వం బీసీల ఆకాంక్షలను నెరవేర్చాలని డ్యాగల శ్రీనివాస్ కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా యువత అధ్యక్షుడు కడారి సురేష్ యాదవ్, పట్టణ ఉపాధ్యక్షుడు మద్దెల శ్యామ్ కుమార్ యాదవ్, కార్యదర్శి గాండ్ల శ్రీనివాస్, శీరంశెట్టి రాజేందర్, మండల నాయకులు మారపాక రమేష్ ముదిరాజ్ సహా బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ట్రస్మ వైరా డివిజన్ అధ్యక్షుడిగా బోడేపూడి కిరణ్

**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 7, తెలంగాణ ముచ్చట్లు;** ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం (ట్రస్మ) సర్వసభ్య సమావేశం నాగులవంచ శ్రీ ఆదర్శ హై స్కూల్ లో ఆదివారం జరిగింది. ట్రస్మ జిల్లా అధ్యక్షుడు గుర్రం కాంతారావు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రైవేటు పాఠశాలలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నాయి అన్నారు. ప్రాథమిక పాఠశాలల రెన్యువల్ రికగ్నైజేషన్ కూడా 10 సంవత్సరాలకు పెంచాలన్నారు. ఈ సమావేశానికి చింతకాని, బోనకల్,వైరా ,కొణిజర్ల, తల్లాడ ఏన్కూరు మండలాలకు చెందిన ప్రైవేటు పాఠశాల కరస్పాండెంట్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వైరా డివిజన్ ట్రస్మ నూతన కమిటీని ఎన్నుకున్నారు.ట్రస్మా డివిజన్ అధ్యక్షుడిగా నాగులవంచ శ్రీ ఆదర్శ విద్యాలయానికి చెందిన బోడేపూడి కిరణ్, కార్యదర్శిగా తల్లాడకు చెందిన పి. ప్రసన్నన్, ట్రెజరర్ గా జె.నరసింహారావు, జాయింట్ సెక్రటరీగా యమునా దాస్, గౌరవాధ్యక్షుడుగా ఎన్. మాధవరెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఇంద్రారెడ్డి, ఈసీ మెంబర్గా వీరపనేని మల్లికార్జునులను ఎన్నుకున్నారు. ప్రైవేటు పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని నూతన సభ్యులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రస్మ జిల్లా బాధ్యులు సంక్రాంతి రవికుమార్, పోతినేని భూమేష్, ఉమా శంకర్, మల్లెంపాటి రంజిత్ పాల్గొన్నారు.



# కాప్రా కమ్మ వారి సేవా సమితి ఆధ్వర్యంలో


## 2026 నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

**కాప్రా, డిసెంబర్ 07 (తెలంగాణ ముచ్చట్లు-):**కాప్రా కమ్మ వారి సేవా సమితి ఆధ్వర్యంలో 2026 సంవత్సర నూతన క్యాలెండర్‌ను శనివారం డా.ఏ.ఎస్.రావు నగర్ డివిజన్ టి ఎస్ ఐ ఐ సి కాలనీ లైన్స్ క్లబ్‌లో ఘనంగా ఆవిష్కరించారు. సమితి అధ్యక్షుడు చల్లపల్లి నాగేశ్వరరావు అధ్యక్షతన ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు.ఉత్తమ టీచర్‌గా రాష్ట్రపతి అవార్డు అందుకున్న కోగంటి రామమోహనరావు, కాప్రా కమ్మ సంఘం అధ్యక్షుడు పొట్లూరి రామకృష్ణ, జనాభ్యుదయ సంఘం సెక్రటరీ సోమేశ్వరరావు, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, ముప్పాళ్ళ సాంబశివరావు (వెట్ ఇండియా), మండవ ప్రేమచంద్, తార్నాక కమ్మ సంఘం నాయకురాలు మన్నే నాగ మల్లీశ్వరి చేతుల మీదుగా క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు పాటిబండ్ల నాగేశ్వరరావు, జనరల్ సెక్రటరీ మల్లికార్జునరావు, జాయింట్ సెక్రటరీ వెంకటరమణ, ట్రెజరర్ హరనాథ్ బాబు, కమిటీ సభ్యులు హనుమాన్, నరసింహారావు, మాల్యాద్రి, సుకుమార్, సుబ్బయ్య, పరుచూరి పవన్, సజ్జ సత్యనారాయణ, తార్నాక కమ్మ సంఘం సభ్యులు చంద్రమౌళి, దేవినేని వెంగబాబు, వాసిరెడ్డి శివ ప్రసాద్, చనుమోలు నాగభూషణం, ఎస్ ఆర్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.



# ఇండిగో సంక్షోభం.. రూ.610 కోట్లమేర రీఫండ్ పూర్తి: కేంద్రం

రద్దయిన, ఆలస్యమైన 'ఇండిగో' విమానాల టికెట్ల రీఫండ్‌కు సంబంధించి ఇప్పటివరకు రూ.610 కోట్ల మేర చెల్లింపులు జరిగినట్లు పౌర విమానయానశాఖ ప్రకటించింది. ప్రయాణికులకు సంబంధించి శనివారం నాటికి ఆ సంస్థ దేశవ్యాప్తంగా 3,000 లగేజీలను డెలివరీ చేసిందని వెల్లడించింది. విమానాల రద్దుతో ప్రభావితమైన ప్రయాణాలను రీషెడ్యూల్ చేసేందుకు ఎటువంటి అదనపు ఫీజులు వసూలు చేయొద్దని తెలిపింది. పరిస్థితులు వేగంగా సాధారణ స్థితికి చేరుకుంటున్నట్లు పేర్కొంది.
టికెట్ల రీఫండ్ ప్రక్రియను ఆదివారం సాయంత్రం నాటికి పూర్తి చేయాలని, లగేజీని రెండు రోజుల్లో డెలివరీ అయ్యేలా చూడాలని కేంద్రం శనివారం ఇండిగోను ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సాధ్యమైనంత త్వరగా చెల్లింపులు జరిగేలా ప్రయత్నాలు చేస్తున్నట్లు ఇండిగో ఇప్పటికే ప్రకటించింది. సంక్షోభం నుంచి బయటపడటంతో పాటు సర్వీసుల పునరుద్ధరణ కోసం చర్యలు తీసుకునేందుకు.. సీఈవో, బోర్డు సభ్యులు కలిసి క్రైసిస్ మేనేజ్‌మెంట్ గ్రూప్ (CMG)ను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు పేర్కొంది.
విమాన కార్యకలాపాల పునరుద్ధరణ విషయంలో దశలవారీగా పుంజుకుంటున్నట్లు ఇండిగో సీఈవో పీటర్ ఎల్బర్స్ తెలిపారు. ఆదివారం పరిస్థితి మరింత మెరుగుపడిందని, 1650 విమానాలు నడుపుతున్నట్లు వెల్లడించారు. సంస్థ 'ఆన్ టైమ్ పెర్ఫార్మెన్స్' నేడు 75 శాతంగా ఉండే అవకాశం ఉందని




సిబ్బందికి పంపిన వీడియో సందేశంలో చెప్పారు. 138 విమానాశ్రయాల్లో 137 చోట్ల సేవలందిస్తున్నట్లు సంస్థ తెలిపింది. పరిస్థితులను చక్కదిద్దేందుకు వేగవంతమైన చర్యలు తీసుకున్నట్లు పౌరవిమానయాన శాఖ సైతం స్పష్టం చేసింది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# పలు ఎయిర్‌పోర్టుల్లో ఇండిగో విమానాల రద్దు..
# ప్రయాణికుల ఇబ్బందులు!

ఇండిగో విమానాల రద్దు సంక్షోభం పూర్తిగా తొలగిపోలేదు. నేడు కూడా పలు ఎయిర్ పోర్టుల్లో ఆ సంస్థ విమానాల రద్దు కొనసాగుతోంది. ముంబయి నుంచి కోల్‌కతా, నాగ్‌పుర్, భోపాల్ వెళ్లే మూడు విమానాలు నిలిచిపోయాయి. మరోవైపు శ్రీనగర్ నుంచి అమృత్‌సర్‌కు వెళ్లాల్సిన రెండు విమానాలు, తిరుచ్చిలో ఐదు అరైవల్స్, ఆరు డొమెస్టిక్ డిపార్చర్ విమానాలను కూడా ఇండిగో రద్దు చేసింది. తిరువనంతపురం, దిల్లీ ఎయిర్‌పోర్టుల నుంచి కూడా మరికొన్ని విమానాలు రద్దయ్యాయి. బెంగళూరులో 76 అరైవల్స్, 74 డిపార్చర్‌లు కలిపి 150 విమానాలు నిలిచిపోయాయి. ఇక హైదరాబాద్‌లో ఏకంగా 100కు పైగా విమానాలు ఆగిపోయిన విషయం తెలిసిందే. రైల్వే శాఖ ముంబయి ఎయిర్‌పోర్టులో ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేసింది. ఇది ప్రయాణికులకు ప్రత్యామ్నాయ ప్రయాణ ఏర్పాట్లు, టికెట్ బుకింగ్స్‌లో సాయం చేస్తోంది.

నేడు దాదాపు 1500 విమాన సర్వీసుల నడపనున్నట్లు ఇండిగో అంచనావేసింది. ఇండిగో మాతృ సంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ రంగంలోకి దిగి సంక్షోభ నివారణకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసింది. మరోవైపు డీజీసీఏ కూడా విమానాల సంక్షోభ వ్యవహారాన్ని ఇప్పటికే చాలా సీరియస్‌గా తీసుకొంది. సీఈవో, సీవోవోలకు షోకాజ్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఆ సంస్థ సీఈవో పీటర్ ఎల్బెర్స్ తన విధి నిర్వహణలో విఫలమైనట్లు పేర్కొంది. ఆ సంస్థ ప్లానింగ్‌లో కూడా వైఫల్యం చెందినట్లు అభిప్రాయపడింది.

మరోవైపు రవాణ, పర్యాటక రంగంపై పనిచేస్తున్న పార్లమెంటరీ కమిటీ కూడా ఇండిగో సహా ఇతర ఎయిర్‌లైన్స్‌లకు సమన్లు జారీ చేయనున్నట్లు కథనాలు వెలువడుతున్నాయి. ముఖ్యంగా ఇతర సంస్థలు ఒక్కసారిగా ధరలు పెంచి ప్రయాణికులపై భారం మోపడంపై ప్రశ్నించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.




## ఇండిగో సంక్షోభం.. రీఫండ్‌లపై కీలక ప్రకటన

దేశవ్యాప్తంగా ఇండిగో విమానాల రద్దు సంక్షోభంతో వేలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎయిర్‌పోర్టుల్లో పడిగాపులు కాస్తున్నారు. ఈ క్రమంలో ప్రయాణికుల టికెట్ల సొమ్ము రీఫండ్‌లపై ఇండిగో కీలక ప్రకటన చేసింది. ప్రయాణికులకు సాధ్యమైనంత త్వరగా ఈ చెల్లింపులు జరిగేలా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపింది. ఇండిగో విమానల రద్దు సంక్షోభానికి సంబంధించి సంస్థ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు సమావేశమైనట్లు వెల్లడించింది. సమస్యకు కారణమైన అంశాలపై చర్చలు జరిపినట్లు తెలిపింది. సీఈవో, బోర్డు సభ్యులు కలిసి క్రైసిస్ మేనేజ్‌మెంట్ గ్రూప్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు పేర్కొంది. సంక్షోభం నుంచి బయటపడటంతో పాటు ఇండిగో విమాన సర్వీసుల పునరుద్ధరణకు ఈ గ్రూప్ చర్యలు తీసుకుంటుందని తెలిపింది. ఇదే క్రమంలో సంక్షోభ సమయంలో ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రయాణికులకు అండగా ఉండేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించింది. రద్దయిన విమానాలకు సంబంధించిన రీఫండ్‌లు, రీషెడ్యూలింగ్‌లపై మినహాయింపులు ఇచ్చేందుకు బోర్డు సభ్యులు తమ ప్రయత్నాలు కొనసాగిస్తున్నారని పేర్కొంది.

## ఇండిగో వ్యవహారం.. ప్రయాణికులకు తీవ్ర మానసిక క్షోభ: కేంద్ర మంత్రి



ఇండిగో కార్యకలాపాల్లో తీవ్ర అంతరాయంతో దేశవ్యాప్తంగా విమానాశ్రయాల్లో గందరగోళ పరిస్థితులు ఏర్పడిన విషయం తెలిసిందే. ఈ పరిణామాలతో ప్రయాణికులు ఎంతో మానసిక క్షోభకు గురయ్యారని పౌరవిమానయానశాఖ సహాయ మంత్రి మురళీధర్ మొహోల్ అన్నారు. వారు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు చెప్పారు. ఈ పరిస్థితులకు బాధ్యులు ఎవరో గుర్తించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

"ఇండిగోకొన్ని బాధ్యతలను నిర్వర్తించలేకపోయింది. ప్రయాణికులందరూ తీవ్ర మానసిక క్షోభను అనుభవించారు. అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ వ్యవహారంపై డీజీసీఏ ఇప్పటికే విచారణ కమిటీని ఏర్పాటు చేసింది. అదేవిధంగా ఓ కంట్రోల్ రూమ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇండిగోకు నోటీసులూ జారీ చేసింది. టికెట్ అమ్మకాల విషయంలో అన్ని విమానయాన సంస్థలపై పరిమితులు విధించాం. నలుగురు సభ్యుల కమిటీ తన నివేదికను సమర్పించిన అనంతరం తగు చర్యలు తీసుకుంటాం" అని మురళీధర్ మొహోల్ తెలిపారు. మరోవైపు రవాణా, పర్యాటకం, సాంస్కృతిక వ్యవహారాల పార్లమెంటరీ స్థాయీ సంఘం.. ఇండిగో ప్రతినిధులతో పాటు సంబంధిత అధికారులకు సమన్లు జారీ చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.

సిబ్బంది కొరత తదితర కారణాలతో కొన్ని రోజులుగా దేశవ్యాప్తంగా ఇండిగో విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. శుక్రవారం ఏకంగా 1,600 విమాన సర్వీసులు రద్దు చేయగా.. శనివారం 800, ఆదివారం 650 సర్వీసులను రద్దు చేసింది. దీంతో వేలాది మంది ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. డిసెంబరు 10 నాటికి విమాన కార్యకలాపాలు సాధారణ స్థితికి చేరుకునే అవకాశం ఉందని సంస్థ తాజాగా ప్రకటించింది. రీఫండ్, లగేజీ అప్పగించే ప్రక్రియను ముమ్మరం చేసినట్లు వెల్లడించింది.

## అందరికీ ఆర్థిక సేవలతో పేదరిక నిర్మూలన.. 'ఆస్కి' వ్యవస్థాపక దినోత్సవంలో కేంద్ర ఆర్థిక సేవల శాఖ కార్యదర్శి ఎం.నాగరాజు

మన దేశంలో పేదరికం కేవలం ఆర్థిక సమస్య మాత్రమే కాదు, ఎంతో నిర్మాణాత్మకమైన సవాలు అని కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సేవల శాఖ కార్యదర్శి ఎం.నాగరాజు అన్నారు. అందరికీ ఆర్థిక సేవలు అందించడం (ఫైనాన్షియల్ ఇంక్లూజన్) దీనికి ఒక పరిష్కారమని అభిప్రాయపడ్డారు. ప్రపంచ వ్యాప్తంగా ఆర్థికాభివృద్ధికి, పేదరిక నిర్మూలనకు 'ఫైనాన్షియల్ ఇంక్లూజన్'ను ఒక ముఖ్య సాధనంగా గుర్తిస్తున్నట్లు వివరించారు. హైదరాబాద్‌లోని అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఆస్కి) 69వ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమంలో ఆయన దిల్లీ నుంచి వర్చువల్ పద్ధతిలో మాట్లాడారు. 'అందరికీ ఆర్థిక సేవలు అందించడం అంటే కేవలం ఒక బ్యాంకు ఖాతా తెరవడం కాదు. ఒక కుటుంబానికి పొదుపు, రుణ సదుపాయాల కల్పన, ఆకస్మిక సంఘటనలను ఎదుర్కొనే శక్తి, విద్యవైద్యంఉపాధిపై పెట్టుబడి పెట్టగల సత్తా కల్పించడం' అని ఆయన వివరించారు.



2014లో ప్రారంభించిన 'పీఎం జన్ ధన్ యోజన' వల్ల గత దశాబ్దకాలంలో అందరికీ ఆర్థిక సేవలు అందుబాటులోకి తీసుకురావడమే కాకుండా ప్రజల ఆర్థిక ముఖచిత్రం సమూలంగా మారిందని ఆయన వివరించారు. దీంతో కోట్లాదిమంది ప్రజలకు బ్యాంకు ఖాతా తెరిచే అవకాశం కలిగిందన్నారు. 'జన్ ధన్ ఖాతాల్లో రూ.2.75 లక్షల కోట్ల నిల్వ ఉంది. ఒక్కో ఖాతాలో సగటున రూ.4,815 ఉన్నాయి. ఈ ఖాతాల్లో 78.2 శాతం గ్రామీణ, సెమీ అర్బన్ ప్రాంతాలకు చెందిన వారివేన'ని అన్నారు. ఇంకా జామ్ (జన్ ధన్, ఆధార్, మొబైల్), బ్యాంకింగ్ టచ్ పాయింట్లు, యూపీఐ, కేంద్రం ప్రారంభించిన ముద్రా రుణాలు, అసంఘటిత రంగంలోని ప్రజలకు ఉపాధి కల్పించే పథకాలు, జన్ సురక్ష బీమా, పింఛను పథకాలు... ఫైనాన్షియల్ ఇంక్లూజన్‌ను మరింతగా విస్తరించినట్లు అభిప్రాయపడ్డారు.

'ప్రజలకు కేవలం ఆర్థిక సేవలు అందిస్తేనే సరిపోదు. సేవల నాణ్యత, అధిక వినియోగం, భద్రత, దీర్ఘకాలిక ఆర్థిక సత్తా కల్పన వంటివి కీలక అంశాలుగా ఉన్నాయి. రుణ సదుపాయాలను విస్తరించే దిశగా సంస్థలను బలోపేతం చేయాల్సి ఉంది. తద్వారా ప్రజలకు మెరుగైన ఆర్థిక భవిష్యత్తును సాధించటానికి వీలుకలుగుతుంద'ని అభిప్రాయపడ్డారు. ఫైనాన్షియల్ ఇంక్లూజన్ వల్ల అందరికీ అభివృద్ధి ఫలాలు అందుతాయని, అసమానతలు తగ్గుతాయని, సుస్థిర ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆస్కి డైరెక్టర్ జనరల్ ఎన్.రమేష్ కుమార్ వందన సమర్పణ చేశారు.

## 'జన్ ధన్ ఖాతాల్లో రూ.2.75 లక్షల కోట్లు'

దేశవ్యాప్తంగా జన్ ధన్ ఖాతాల్లో రూ.2.75 లక్షల కోట్లు ఉన్నాయని ఆర్థిక సేవల విభాగం కార్యదర్శి ఎం.నాగరాజు తెలిపారు. ఈ లెక్కన ఒక్కో ఖాతాలో సగటున రూ.4,815లు ఉన్నట్లు అవుతుందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు రూ.3.67 లక్షల కోట్లు ప్రత్యక్ష నగదు బదిలీ పథకం ద్వారా లబ్ధిదారులకు బదిలీ చేసినట్లు చెప్పారు. అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో శనివారం జరిగిన ఓ కార్యక్రమంలో



మాట్లాడుతూ ఆయన ఈ విషయాలు వెల్లడించారు.

భారతదేశ ఆర్థిక సమ్మిళితత్వ ప్రయాణాన్ని నాగరాజు ఒక 'అద్భుతం'గా అభివర్ణించారు. 2014లో ప్రారంభించిన ప్రధానమంత్రి జన్ ధన్ యోజన పథకం ఈ ప్రయాణంలో కీలక పాత్ర పోషించిందన్నారు. దీనివల్ల దాదాపు 57 కోట్ల మంది బ్యాంకింగ్ వ్యవస్థలోకి వచ్చారన్నారు. 78.2 శాతం జన్ ధన్ ఖాతాలు గ్రామీణ, సెమీఅర్బన్ ప్రాంతాల్లో ఉన్నాయన్నారు. అలాగే మొత్తం ఖాతాల్లో 50 శాతం మహిళలకు చెందినవని వెల్లడించారు.

# వెండి అమ్మేస్తున్నారు

## వారంలోనే 100 టన్నులు విక్రయం



బంగారంతో పోటీపడుతూ వెండి ధరలు పెరుగుతున్నాయి. పేదవారి బంగారంగా పేర్కొనే వెండి ధర కిలోకు రూ.1,83,000 పలుకుతోంది. అందువల్లే ధర తక్కువగా ఉన్నప్పుడు వెండిని కిలోల లెక్కన కొని పెట్టుకున్న వారు, వినియోగించని వెండి రూపులుఆభరణాలు ఉన్నవారు విక్రయిస్తున్నారు.

వెండి ధర మూడేళ్లలోపే మూడింతలకు పైగా పెరిగింది. 2010కి ముందు కిలో వెండి రూ.30,000 లోపే ఉండేది. తదుపరి 2020లో ధరలు దూసుకెళ్లి, కిలో రూ.70,000 వరకు పెరిగింది. అప్పుడు కూడా కిలో రూ.లక్షకు చేరుతుందనే అంచనాల నేపథ్యంలో, భారీ ఎత్తున పలువురు కొనుగోలు చేశారు. అయితే ధరలో భారీ దిద్దుబాటు వచ్చి కిలో రూ.40,000 లోపునకు వచ్చింది. 2020 కొవిడ్ పరిణామాల ముందు వరకు ఇవే ధరలున్నాయి. 2020 ఆగస్టు సమయంలో మళ్లీ కిలో వెండి రూ.70,000 సమీపానికి వెళ్లినా, స్వల్ప వ్యవధిలోనే తగ్గింది. 2022 వరకు రూ.55,000 సమీపంలోనే ఉంది. 2023 నుంచి వెండి ధర పెరుగుతూ వచ్చి రూ.80,000 సమీపానికి, 2024లో రూ.95,000కు చేరింది. ఈ ఏడాది జనవరిలోనే తొలిసారిగా రూ.లక్షను మించింది. తదుపరి పెరుగుతూ వచ్చి ఇప్పుడు రూ.1.80 లక్షలను మించింది. దీపావళి సమయంలోనూ వెండి ధర ఈ స్థాయిలకు చేరినా, నిలబడలేదు. గత నెలలో రూ.1.50 లక్షల సమీపానికి తగ్గింది. మళ్లీ ఇప్పుడు ధర పెరిగినందున, గతంలో తక్కువ ధరలో కొనుగోలు చేసిన వారు, విక్రయిస్తున్నారు. గతవారంలోనే ఇలా 100 టన్నుల వెండి అమ్మకానికి వచ్చిందని ది ఇండియా బులియన్ అండ్ జువెలర్స్ అసోసియేషన్ (ఐబీజేఏ) తెలిపింది. ఇంత భారీ మొత్తంలో వెండి అమ్మకానికి రావడంపై బులియన్ దుకాణదారులు ఆశ్చర్యపోతున్నారు.

ధరలు పెరిగాక పాత బంగారు, వెండి ఆభరణాలు మార్చుకుని, కొత్తవి తీసుకోవడం పెరిగింది. తమ దగ్గర నగదు ఉన్నప్పుడు కొనుగోలు చేసిన మేలిమి వెండి దిమ్మెలను, వినియోగించని వెండి వస్తువులను.. ఆభరణాల తయారీదార్లకు పలువురు విక్రయిస్తుంటారు. ఇలా ప్రతినెలలో సగటున 10 15 టన్నుల పాత వెండి విపణిలోకి వస్తుంటుంది. ఈసారి మాత్రం సాధారణ నెలవారీ సగటుకు 10 రెట్లు అధిక వెండి వారంలోనే అమ్మకానికి వచ్చిందని ఐబీజేఏ జాతీయ కార్యదర్శి సురేంద్ర మెహతా తెలిపారు. లాభాల స్వీకరణకు ఎక్కువమంది ప్రయత్నించడమే ఇందుకు కారణమని వివరించారు. పెళ్లిళ్ల సీజన్, శీతాకాలం విహార యాత్రలకు వెళ్లేందుకు నగదు కోసం.. ఇంట్లో నిల్వ ఉన్న వెండిని, పాత ఆభరణాలనూ అమ్ముతున్నారనీ పేర్కొన్నారు. కిలో వెండి రూ.2 లక్షలకు చేరుతుందనే అంచనాలతో కొనుగోలు చేసినవారు కూడా, ఇటీవలి ధరల దిద్దుబాటును చూస్తూ.. 'వచ్చిన మేరకు లాభాలు పొందుదాం. ధర తగ్గితే కొన్నేళ్ల పాటు వేచి చూడాల్సి వస్తుంది' అనే భావనతోనే విక్రయిస్తున్నారు.

వెండి ఉత్పత్తి నేరుగా జరగడం తక్కువే. పసిడి తవ్వకాల్లో భాగంగా వెండినీ ఉత్పత్తి చేస్తుంటారు. ఇదేవిధంగా సీసం, జింక్ తవ్వకాల సమయంలోనూ వెండి లభిస్తుంటుంది. 2025లో చూస్తే గనుల నుంచి వెలికితీసిన వెండి మొత్తం 813 మిలియన్ ఔన్సులు (ఔన్సు 31.10 గ్రాములు) మాత్రమే. మెక్సికో, రష్యాల నుంచి అధికంగా అందుబాటులోకి వచ్చింది. పెరూ, ఇండోనేసియాల్లో ఈ ఉత్పత్తి తగ్గింది. పాత వెండితో కలిసి అంతర్జాతీయంగా 1.022 బిలియన్ ఔన్సుల వెండి అందుబాటులో ఉంటుందని, గిరాకీ 1.117 బిలియన్ ఔన్సులు ఉండొచ్చన్నది మార్కెట్ వర్గాల అంచనా.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# గోళ్లలోనే ఆయుష్షు రహస్యం



గోళ్లు కేవలం అందానికే కాదు.. మీ ఆరోగ్యం, దీర్ఘాయువును కూడా వెల్లడిస్తాయని డేవిడ్ సింక్లెయిర్ వెల్లడిరచారు. గోళ్ల పెరుగుదల వేగం నెమ్మదిగా వృద్ధాప్యం చెందడాన్ని సూచిస్తుంది. నల్ల మచ్చలు, తెల్లటి గీతలు, వంకర గోళ్లు వంటి మార్పులు తీవ్ర అనారోగ్యాలకు సంకేతం కావచ్చు. గోళ్లు కేవలం అందానికే కాదు.. అవి మన ఆరోగ్యాన్ని, మనం ఎంతకాలం జీవిస్తామో కూడా చెబుతాయని ప్రపంచ ప్రఖ్యాత సైంటిస్ట్ డాక్టర్ డేవిడ్ సింక్లెయిర్ వెల్లడిరచారు. హార్వర్డ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ అయిన డేవిడ్ ప్రకారం.. గోళ్లు పెరిగే వేగం మన శరీరం ఎంత బాగా పనిచేస్తుందో చెప్పే ఒక ముఖ్యమైన సూచిక. "మీ గోళ్ల పెరుగుదల రేటు మీరు వృద్ధాప్యంలో ఉన్నారా లేదా అనేదానికి నిజంగా ఒక మంచి ఇండికేటర్" అని డాక్టర్ సింక్లెయిర్ అన్నారు. గోళ్లు ఎంత వేగంగా పెరుగుతున్నాయో అనే దాన్ని బట్టి మీ జీవసంబంధమైన వయస్సు తెలుసుకోవచ్చు. దీని అర్థం మీరు పుట్టిన రోజు ప్రకారం ఉన్న వయసు కాకుండా మీ శరీరం లోపల ఎంత ఆరోగ్యంగా ఉందో చెప్పే వయసు అన్నమాట. మీ గోళ్లు వేగంగా పెరుగుతున్నాయంటే.. మీరు సగటు మనుషుల కంటే నెమ్మదిగా వృద్ధాప్యం చెందుతున్నారని అర్థం. అంటే మీరు ఎక్కువ కాలం ఆరోగ్యంగా ఉండే అవకాశం ఉంది. 30 ఏళ్లు దాటాక గోళ్ల పెరుగుదల రేటు కొద్దిగా తగ్గుతుంది. దీనికంటే మరీ నెమ్మదిగా పెరిగితే మీరు వయసు కంటే త్వరగా ముసలితనం వైపు వెళ్తున్నట్లు సూచన కావచ్చు. ఈ అధ్యయన ఫలితాలను తెలుసుకున్న తర్వాత డాక్టర్ సింక్లెయిర్ కూడా తన గోళ్ల పెరుగుదలను తరచుగా పర్యవేక్షిస్తున్నానని తెలిపారు. వయసు పెరిగే కొద్దీ గోళ్లు మారుతూ ఉంటాయి. దీనికి ప్రధాన కారణం రక్త ప్రసరణ మందగించడం, దీనివల్ల గోళ్లకు పోషకాలు తక్కువగా అందుతాయి. ఫలితంగా వయసు మీద పడినప్పుడు గోళ్లు నీరసంగా, పెళుసుగా మారవచ్చు. అయితే, వయసు మాత్రమే కాదు, గోళ్లలో వచ్చే కొన్ని మార్పులు తీవ్ర అనారోగ్యాలకు సంకేతం కావచ్చు నల్లటి మచ్చలు -గీతలు: గోళ్ల కింద నల్ల మచ్చలు కనిపిస్తే అది చర్మ క్యాన్సర్ లాంటి తీవ్రమైన సమస్యకు సంకేతం కావచ్చు. తెల్లటి మచ్చలు - గీతలు: శరీరంలో జింక్, కాల్షియం లేదా ఐరన్ లోపం ఉన్నట్లు లేదా ఫంగల్ ఇన్ఫెక్షన్ సోకినట్లు అర్థం చేసుకోవచ్చు. గోళ్లు వంకర పోవడం: గోళ్లు వెడల్పుగా మారి, వేలిముద్రల వైపు చుట్టుకుంటే అది శరీరంలో ఆక్సిజన్ లోపం ఉన్నట్లు సూచిస్తుంది. ఇది దీర్ఘకాలిక గుండె లేదా ఊపిరితిత్తుల వ్యాధులకు సంకేతం కావచ్చు. గోళ్ల ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా, వాటిలో కనిపించే ఏవైనా అసాధారణ మార్పులను వైద్యులకు చూపించడం ముఖ్యం.



# హై-ప్రోటీన్ పనీర్ బ్రేక్‌ఫాస్ట్‌లు

ఉదయం తీసుకునే అల్పాహారం మన రోజు మొత్తాన్ని ప్రభావితం చేస్తుంది. ముఖ్యంగా మనం తీసుకునే అల్పాహారంలో ప్రోటీన్ శాతం ఎక్కువగా ఉంటే, అది రోజంతా నిరంతర శక్తిని అందిస్తుంది. ప్రోటీన్ జీర్ణమవడానికి ఎక్కువ సమయం పడుతుంది కాబట్టి, ఇది త్వరగా ఆకలి వేయకుండా. ఉదయం తీసుకునే అల్పాహారం మన రోజు మొత్తాన్ని ప్రభావితం చేస్తుంది. ముఖ్యంగా మనం తీసుకునే అల్పాహారంలో ప్రోటీన్ శాతం ఎక్కువగా ఉంటే, అది రోజంతా నిరంతర శక్తిని అందిస్తుంది. ప్రోటీన్ జీర్ణమవడానికి ఎక్కువ సమయం పడుతుంది కాబట్టి, ఇది త్వరగా ఆకలి వేయకుండా, కడుపు నిండిన అనుభూతిని ఇస్తుంది. తద్వారా అనవసరమైన చిరుతిళ్లను తినకుండా బరువు నియంత్రణలోనూ సహాయపడుతుంది. మన శరీరానికి అవసరమయ్యే రోజువారి ప్రోటీన్ అవసరాలను తీర్చడానికి, పనీర్ ఒక అద్భుతమైన ఆహారం.

పనీర్ భుర్జీ టోస్ట్: గుడ్డు భుర్జీ మాదిరిగానే, తురిమిన పనీర్‌ను టమాటాలు, ఉల్లిపాయలు, క్యాప్సికమ్ మరియు తక్కువ మసాలాలతో కలిపి వండటం. ఇది త్వరగా తయారయ్యే రుచికరమైన ప్రోటీన్ వంటకం. క్రిస్పీగా ఉండే టోస్ట్‌తో కలిపి తీసుకుంటే, బిజీగా ఉండే ఉదయం వేళల్లో తక్షణ శక్తిని ఇస్తుంది. పనీర్ స్టఫ్డ్ పరాఠా: తురిమిన పనీర్‌ను వాము, కొత్తిమీర, పచ్చిమిర్చి వంటి వాటితో కలిపి పిండిలో నింపి చేసే సంప్రదాయ పరోటా ఇది. ఇది ఒక సంపూర్ణమైన క్లాసిక్ బ్రేక్‌ఫాస్ట్. అధిక శక్తిని ఇచ్చి, చాలా గంటల పాటు కడుపు నిండుగా ఉంచుతుంది. దీన్ని పెరుగు లేదా పచ్చడితో కలిపి తీసుకోవచ్చు.

పనీర్ వెజిటబుల్ ఉప్మా: సాంప్రదాయ ఉప్మాకు ప్రోటీన్ జోడిరపు. ఉప్మా రవ్వతో పాటు, ముక్కలు చేసిన పనీర్, క్యారెట్లు, బీన్స్, బఠానీలు వంటి కూరగాయలను కూడా వేసి తయారుచేయడం. ఇది తేలికగా, పోషకాలతో నిండి ఉంటుంది. ఉదయం పూట ఉప్పు, కారం తక్కువగా ఉండే అల్పాహారాన్ని కోరుకునే వారికి ఇది సరైన ఎంపిక.

గ్రిల్డ్ పనీర్ శాండ్‌విచ్: మ్యారినేట్ చేసిన పనీర్ ముక్కలు, తాజా కూరగాయలు మరియు పుదీనా చట్నీతో నింపి గ్రిల్ చేస్తే సరిపోతుంది. ఇది సమతుల్యతతో కూడిన మరియు త్వరగా కడుపు నింపే ఆహారం. బయట క్రిస్పీగా, లోపల ప్రోటీన్-రిచ్ పనీర్ ఫిల్లింగ్‌తో రుచికరంగా ఉంటుంది. పనీర్ ఆమ్లెట్: గుడ్డు ఆమ్లెట్, స్క్రాంబుల్‌లో చిన్న ముక్కలుగా కట్ చేసిన లేదా తురిమిన పనీర్‌ను, కొత్తిమీర, ఇతర కూరగాయలతో కలిపి తయారు చేసేదే పనీర్? ఆమ్లెట్?. ఈ కాంబినేషన్ ద్వారా ఒకే భోజనంలో గుడ్డు, పనీర్ రూపంలో రెండు బలమైన ప్రోటీన్ మూలాలను పొందుతారు. ఇది చాలా సులభమైన, బలమైన అల్పాహారం. మీ రోజును ఆరోగ్యకరంగా, శక్తివంతంగా ప్రారంభించాలంటే, ఈ 5 పనీర్ వంటకాలను మీ బ్రేక్‌ఫాస్ట్ లో ట్రై చేసి చూడండి!

# ఈ చిన్న టిప్స్‌తో.. యూత్ లుక్ గ్యారెంటీ




వయసు పెరుగుతున్న కొద్దీ చర్మం నిగారింపు తగ్గడం, ముడతలు రావడం, త్వరగా అలసిపోవడం వంటి మార్పులు సహజం. అయితే ఖరీదైన క్రీములు, చికిత్సలు, మందులు లేకుండానే వృద్ధాప్యాన్ని సహజంగా నెమ్మదింప చేయవచ్చని తాజా అధ్యయనాలు చెపుతున్నాయి. వయసు పెరుగుతున్న కొద్దీ చర్మం నిగారింపు తగ్గడం, ముడతలు రావడం, త్వరగా అలసిపోవడం వంటి మార్పులు సహజం. అయితే ఖరీదైన క్రీములు, చికిత్సలు, మందులు లేకుండానే వృద్ధాప్యాన్ని సహజంగా నెమ్మదింప చేయవచ్చని తాజా అధ్యయనాలు చెపుతున్నాయి. మనం ప్రతి రోజు ఉదయాన్ని ఎలా ప్రారంభిస్తామన్నదే మన ఆరోగ్యంపై, చర్మంపై చాలా పెద్ద మార్పును తీసుకువస్తుంది.ఉదయాన్నే లేవగానే ఫోన్ చూడటం చాలామందికి అలవాటు. కానీ దాని బదులు, లేవగానే కిటికీ తెరిచి బయట నుంచి వచ్చే సూర్యరశ్మిని మీ చర్మానికి తగిలేలా చేస్తే అది శరీరానికి చాలా మంచిది. సూర్యరశ్మి మన శరీరం యొక్క జీవ గడియారాన్నిసరిగ్గా అమరుస్తుంది. దీనివల్ల నిద్ర బాగా పడుతుంది, మనసు ప్రశాంతంగా ఉంటుంది. ఉదయం ఐదు నిమిషాలైనా సూర్యరశ్మిని ముఖానికి తగలనివ్వడం అలవాటు చేసుకుంటే చర్మం కూడా కాంతివంతంగా ఉంటుంది. ఉదయాన్నే వేడి నీళ్లు తాగడం వల్ల వృద్ధాప్యం నెమ్మదిస్తుంది. వేడి నీళ్లు రక్తప్రసరణను మెరుగుపరుస్తాయి. శరీరంలో పేరుకుపోయిన వ్యర్థాలను బయటికి పంపిస్తాయి. అల్లం టీ, గ్రీన్ టీ, నిమ్మకాయ, తేనె కలిపిన పానీయాలు కూడా శరీరానికి శుభ్రతను, చురుకుదనాన్ని ఇస్తాయి. ఉదయం ఇలా తేలికైన ద్రవం తీసుకోవడం వల్ల కడుపుబ్బరం తగ్గి, చర్మం లోపలి నుంచి కాంతివంతంగా ఉంటుంది. నీళ్లు తాగాక లేదా లేవగానే కేవలం ఒక్క నిమిషం పాటు శరీరాన్ని నెమ్మదిగా కదిలించడం చాలా మంచి అలవాటు. దీనిని 'మొబిలిటీ మినిట్' అంటారు. మోకాళ్లు, చేతులు, మెడ, వెన్ను భాగాలను నెమ్మదిగా కదుపుతూ ఉంటే, శరీరంలో బిగుతుదనం (స్టిఫ్‌నెస్) తగ్గుతుంది. కండరాలు సడలుతాయి. ఈ చిన్న కదలిక శరీరానికి తక్షణమే ఉత్సాహాన్ని ఇస్తుంది.

మీ రోజు ఎలా గడుస్తుందో మీ అల్పాహారంపై ఆధారపడి ఉంటుంది. ఉదయాన్నే మాంసకృత్తులు (ప్రోటీన్) ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకుంటే శరీరం రోజంతా శక్తివంతంగా ఉంటుంది. గుడ్లు, వేరుశనగ వెన్న, పెరుగు, బాదం, ఓట్స్ వంటివి మంచి ఆహారాలు. ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను కూడా అదుపులో ఉంచుతాయి, తద్వారా నిస్సత్తువ రాకుండా చేస్తాయి. లేవగానే చాలామంది చేసే అత్యంత హానికరమైన పని ఫోన్ చూడటం. నిపుణుల ప్రకారం, ఫోన్ స్క్రీన్‌ను ఉదయం చూడటం వల్ల మన జీవ గడియారానికి అంతరాయం కలుగుతుంది. మానసిక ఒత్తిడి పెరుగుతుంది, ఏకాగ్రత తగ్గుతుంది. అంతేకాక, ఇది వృద్ధాప్యాన్ని వేగంగా తీసుకొచ్చే హార్మోన్లలో అసమతుల్యతకు కారణమవుతుంది. కాబట్టి, ఉదయం లేచిన వెంటనే కాకుండా, కనీసం 20 నిమిషాల గ్యాప్ ఇచ్చిన తర్వాత ఫోన్ చూడటం మంచిది. ఆ సమయంలో నీళ్లు తాగడం, స్వల్ప వ్యాయామం చేయడం వంటివి చేయండి. ఖరీదైన సౌందర్య సాధనాలు కాకుండా, ఈ చిన్న చిన్న అలవాట్లను ప్రతి ఉదయం క్రమంగా పాటించడం ద్వారా వృద్ధాప్య లక్షణాలను సహజంగా నియంత్రించవచ్చు. ఈ అలవాట్లు మీ ఆరోగ్యాన్ని, చర్మాన్ని దీర్ఘకాలం కాపాడుతాయి.

# పిల్లల ఏకాగ్రతను పెంచే మ్యాజికల్ స్టడీ స్పేస్

పిల్లలు పాఠాలు చదువుతున్నప్పుడు, వాళ్ల ఏకాగ్రత మరియు ఉత్సాహం చాలా ముఖ్యం. ఒక చక్కని, సుశ్రీకరించిన స్టడీ టేబుల్ ఉంటే, అది వాళ్లకు ఒక ప్రత్యేకమైన పని ప్రదేశంగా మారుతుంది. టేబుల్ మీద సరైన వెలుతురు అందించే డెస్క్ ల్యాంప్ పెట్టడం వల్ల కళ్లకు ఒత్తిడి తగ్గుతుంది మరియు చదవడం సులభమవుతుంది. అలాగే, పెన్సిల్స్, పెన్‌లు, ఇతర సాధనాలను ఆర్డర్‌గా ఉంచే హోల్డర్ ఉంటే, వాళ్లు అవతలకు చూడకుండా తమ పనిపై దృష్టి పెట్టగలరు. ఇలాంటి చిన్న మార్పులు పిల్లలలో క్రమశిక్షణను పెంచుతాయి మరియు అధ్యయనాన్ని ఆసక్తికరంగా మారుస్తాయి. మొత్తంగా, ఇటువంటి టేబుల్ ఒక సానుకూల ఎనర్జీని సృష్టిస్తుంది, దాని వల్ల పిల్లలు ప్రతిరోజూ చదువుటకు ఆకాంక్ష చెందుతారు. పిల్లల మనసులో మోటివేషన్‌ను రేకెత్తించడానికి, స్టడీ టేబుల్ మీద ప్రేరణాత్మక కొటేషన్లు పెట్టడం అద్భుతమైన ఆలోచన. ఉదాహరణకు, ''విజయం కష్టపడటం నుండి వస్తుంది'' అనే మాటలు వాళ్లను ప్రోత్సహిస్తాయి మరియు కష్టాలను అధిగమించే ధైర్యాన్ని ఇస్తాయి. ఇక స్టడీ ప్లానర్ ఒక అవసరమైన సాధనం, ఇది పిల్లలకు తమ రోజువారీ పనులను ప్లాన్ చేయటం, టైమ్ మేనేజ్‌మెంట్ నేర్పుతుంది. ప్రతి రోజు ముందుగానే పాఠాలు, హోమ్‌వర్క్‌లను గుర్తుచేసుకోవడం వల్ల వాళ్లు ఒత్తిడి లేకుండా పని చేస్తారు. ఈ కొటేషన్లు మరియు ప్లానర్ కలిసి పిల్లలలో ఒక లక్ష్యభావాన్ని సృష్టిస్తాయి, దాని వల్ల అధ్యయనం ఒక ఆనందకరమైన ప్రక్రియగా మారుతుంది. ఇలా చేయడం వల్ల పేరెంట్స్ కూడా తమ పిల్లల ప్రోగ్రెస్‌ను సులభంగా ట్రాక్ చేసుకోగలరు.



స్టడీ సమయంలో పిల్లల ఆరోగ్యాన్ని కాపాడటానికి, టేబుల్ మీద ఒక వాటర్ బాటిల్ ఉంచడం మరపురాని చిట్కా. హైడ్రేటెడ్‌గా ఉండటం వల్ల వాళ్ల మెదడు ఆక్సిజన్ మరియు పోషకాలను బాగా పొందుతుంది, దాని వల్ల ఏకాగ్రత ఎక్కువ కాలం పాటు ఉంటుంది. అలాగే, ఎక్కువ శబ్దం చేయని ఒక చిన్న గడియారం పెట్టడం వల్ల, పిల్లలు సమయాన్ని గమనించకుండా తమ పనిపై దృష్టి పెట్టగలరు. ఈ గడియారం టిక్‌టాక్ సౌండ్ లేకుండా డిజిటల్ డిస్‌ప్లే ఇస్తుంది, కాబట్టి డిస్ట్రాక్షన్ తగ్గుతుంది. వాటర్ బాటిల్ మరియు గడియారం కలిపి, పిల్లలలో ఒక ఆరోగ్యకరమైన అలవాటును పెంచుతాయి. ఇవి చిన్నవి అయినప్పటికీ, పిల్లల రోజువారీ రొటీన్‌ను మెరుగుపరుస్తాయి మరియు అధ్యయన సమయాన్ని సమర్థవంతంగా మారుస్తాయి. చివరగా, స్టడీ టేబుల్ మీద ఒక చిన్న మొక్క పెట్టడం వల్ల ప్రశాంతమైన వాతావరణం ఏర్పడుతుంది, ఇది పిల్లల మనసును శాంతపరుస్తుంది. మొక్కలు ఆక్సిజన్‌ను విడుదల చేస్తాయి మరియు గాలి ప్రశుద్ధి చేస్తాయి, దాని వల్ల చదువుతున్నప్పుడు తాజాగా అనిపిస్తుంది. ఉదాహరణకు, ఒక చిన్న సక్యులెంట్ లేదా టూల్సీ మొక్క టేబుల్‌కు ఆకర్షణీయంగా కనిపిస్తుంది మరియు పిల్లలలో బాధ్యతాభావాన్ని కూడా పెంచుతుంది. ఈ మొక్క వల్ల టేబుల్ ఒక జీవంతమైన స్పేస్‌గా మారుతుంది, దాని వల్ల పిల్లలు చదువుటను ఒక సృజనాత్మక కార్యకలాపంగా భావిస్తారు. మొత్తంగా, ఈ చిన్న మార్పులు పిల్లల అకడమిక్ ప్రదర్శనను మెరుగుపరుస్తాయి మరియు వాళ్లలో ఒక సానుకూల మనోభావాన్ని పెంచుతాయి, ఫలితంగా అధ్యయనం ఒక ఆనందంగా మారుతుంది.

# పిల్లల ప్రవర్తన, భవిష్యత్తుపై తండ్రి ప్రభావం

పిల్లలకు వారి నాన్నే మొదటి హీరో. ఇంటి వాతావరణం ఆరోగ్యకరంగా ఉంటేనే, పిల్లల మానసిక ఆరోగ్యం కూడా బలంగా ఉంటుంది. ప్రత్యేకించి, తండ్రి ఇంట్లో ఎలా ప్రవర్తిస్తారు, ఎలా మాట్లాడుతారు అనే అంశాలు పిల్లల మనసులో లోతుగా నాటుకుపోతాయి.పిల్లలకు వారి నాన్నే మొదటి హీరో. ఇంటి వాతావరణం ఆరోగ్యకరంగా ఉంటేనే, పిల్లల మానసిక ఆరోగ్యం కూడా బలంగా ఉంటుంది. ప్రత్యేకించి, తండ్రి ఇంట్లో ఎలా ప్రవర్తిస్తారు, ఎలా మాట్లాడుతారు అనే అంశాలు పిల్లల మనసులో లోతుగా నాటుకుపోతాయి. తండ్రి అంటే కేవలం సంపాదించే వ్యక్తి మాత్రమే కాదు, ఇంట్లో విలువలు, నైతికత, ధైర్యం, క్రమశిక్షణ వంటివన్నీ పిల్లలు ఆయన దగ్గరి నుంచే నేర్చుకోవడానికి ప్రయత్నిస్తారు. అందుకే, పిల్లల ఎదుగుదల, వారి భవిష్యత్తు నిర్మాణం ప్రధానంగా తండ్రి ప్రవర్తనపై ఆధారపడి ఉంటుంది. అలాంటి సందర్భాల్లో తండ్రి ఎలా ఉండాలి? నిపుణుల సలహా ఏంటి? పిల్లలు మాటల కంటే ముందు ప్రవర్తననే గమనించి, నేర్చుకుంటారు. తండ్రి ఇతరులతో ఎలా మాట్లాడుతున్నాడు, ఆయన తన కోపాన్ని ఎలా అదుపు చేసుకుంటున్నాడు, ఎలాంటి సందర్భాలలో సహనంతో ఉంటున్నాడు వంటి విషయాలను వారు చాలా నిశితంగా పరిశీలిస్తారు. అవే పద్ధతులను అనుకరించడానికి కూడా ప్రయత్నిస్తారు. అంతేకాకుండా, నిజాయితీ, బాధ్యత, దయ, సమయపాలన, క్రమశిక్షణ వంటి లక్షణాలు కూడా చిన్నప్పటి నుంచే తండ్రిని చూసి పిల్లలు అలవర్చుకునే అవకాశం ఉంది. పిల్లలు ఏదైనా చిన్న పని చేసినా, దానికి తండ్రి ప్రశంసించినప్పుడు వారు చాలా సంతోషిస్తారు. ఆ అభినందన వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతుంది. అలా కాకుండా, వారు చేసే ప్రతి పనిలో తప్పులు వెతకడం, విమర్శించడం చేస్తే, పిల్లలు భయపడే స్వభావాన్ని ఎక్కువగా అభివృద్ధి చేసుకుంటారు. ఇది వారి వ్యక్తిత్వ వికాసాన్ని దెబ్బతీస్తుంది. ఇంట్లో ప్రతి చిన్న విషయానికీ తండ్రి కోపం చూపించడం, గట్టిగా అరవడం, కొట్టడం లాంటివి చేస్తే, దాని ప్రభావం పిల్లలపై తీవ్రంగా ఉంటుంది. దీనివల్ల వారిలో భయం, అసురక్షిత భావం పెరుగుతాయి. అంతేకానీ, హింసను చాలా సాధారణ విషయంగా భావించి, వారు కూడా భవిష్యత్తులో ఇతరులతో అలాగే ప్రవర్తించే అవకాశం ఉంది. ముఖ్యంగా మగ పిల్లలు తండ్రి నుంచి ఆ ప్రవర్తనను అనుకరించాలని చూస్తారు. అదే విధంగా, తండ్రి తమ తల్లిని గౌరవంగా చూస్తే, పిల్లలు కూడా పెద్దయ్యాక మహిళలను గౌరవించడం, ఇంటి పనుల్లో సహాయం చేయడం, ప్రేమతో మాట్లాడటం వంటి మంచి అలవాట్లను నేర్చుకుంటారు. పిల్లలకు ఆదర్శంగా ఉండేందుకు, ప్రతి తండ్రి కచ్చితంగా కొన్ని పద్ధతులను పాటించాలి. పిల్లలతో కఠినంగా కాకుండా, వారిలో ధైర్యం నింపే విధంగా ప్రేమతో మాట్లాడాలి. పిల్లల ముందు కోపం, అసహనం, అసభ్యకర పదజాలం వాడటం వంటివి చేయకూడదు. భావోద్వేగాలను నియంత్రించుకోవాలి. తల్లిని గౌరవించడం.. ఇది పిల్లలకు నేర్పగలిగే గొప్ప పాఠం. పిల్లలు కుటుంబాన్ని ఎలా చూడాలి, ఇతరులతో ఎలా మెలగాలి




అనే విషయాన్ని తండ్రి ద్వారా నేర్చుకుంటారు. మంచి అలవాట్లు పాటించాలి. పుస్తకాలు చదవడం, వ్యాయామం చేయడం వంటి మంచి అలవాట్లు నేర్చకోవాలంటే, ముందుగా తండ్రే వాటిని పాటించాలి. సమయం కేటాయించాలి. ఎంత పనిలో నిమగ్నమై ఉన్నా కూడా, తండ్రి కచ్చితంగా పిల్లల కోసం కొంచెం సమయం కేటాయించడం తప్పనిసరి. తండ్రి ప్రవర్తన పిల్లల జీవితంలో శాశ్వతమైన ముద్ర వేస్తుంది కాబట్టి, ప్రతి తండ్రీ తమ ప్రవర్తన పట్ల జాగ్రత్తగా ఉండాలి.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## ప్రజా పాలన విజయోత్సవాలపై
# సీఎం స్పష్టత ఇవ్వాలి: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):




కాంగ్రెస్ ప్రభుత్వం గత రెండేళ్ల కాలంలో ఏం సాధించిందని ప్రజా పాలన విజయోత్సవాలను జరుపుకుంటున్నారో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలకు తెలియజేయాలని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన నల్ల గొండలోని బీజేపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, బీఆర్ఎస్ గత 10 సంవత్సరాల కాలంలో ఏం చేసిందో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రెండు సంవత్సరాల్లో అదే చేసిందని పేర్కొన్నారు. ఎమ్మెల్యేల ఫిరాయింపులతో పాటు అవినీతిలో కూడా గత బీఆర్ఎస్ కంటే కాంగ్రెస్ ప్రభుత్వం ముందుందని ఎద్దేవా చేశారు.

ఆరు గ్యారంటీలు, 420 సబ్ గ్యారంటీలలో ఏమేమి అమలు చేశారో స్పష్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ రెండు సంవత్సరాల కాలంలో సింగరేణి నుంచి హైటెక్ సిటీ వరకు భూముల అమ్మకాల్లో గత బీఆర్ఎస్ కంటే కాంగ్రెస్ సర్కార్ ముందు నిలిచిందన్నారు. భూముల ఆక్రమణలో మంత్రుల నుంచి కింది స్థాయి కాంగ్రెస్ నాయకుల వరకు రెచ్చిపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనకు ప్రస్తుత కాంగ్రెస్ పాలనకు పెద్దగా తేడా ఏమీ లేదన్నారు. రానున్న కాలంలో కాంగ్రెస్ సర్కార్ ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కర్ణాటకలో సీఎం మార్పుపై కాంగ్రెస్ అధిష్టానం సస్పెన్స్ కొనసాగిస్తోంది



కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీలో అధికార మార్పిడిపై సస్పెన్స్ కొనసాగుతోంది. ఢిల్లీలో సోనియా గాంధీ నివాసంలో శనివారం రాత్రి అధిష్టానం నేతలు సమావేశమయ్యారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో కర్ణాటక అంశాన్ని ప్రత్యేకంగా చర్చించినట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తెలిపారు.

అయితే సమావేశంలో ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని, రానున్న రోజుల్లో మరోసారి సమావేశమై చర్చిస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల మధ్య ఎలాంటి విభేదాలు లేవని, అందరూ కలసికట్టుగానే ఉన్నారని కూడా తెలిపారు. ముఖ్యమంత్రి సిద్ధ రామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మధ్య రెండు బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్‌ల అనంతరం రాష్ట్రంలో సీఎం మార్పు అంశం తాత్కాలికంగా బ్రేకులు పడిన సంగతి తెలిసిందే. 'ఐదేళ్లు నేనే సీఎం' అని చెప్పుకునే స్థాయి నుంచి 'రాజకీయాల్లో ఏదీ శాశ్వతం కాదు' అని చెప్పుకునే స్థాయి వరకూ సిద్ధరామయ్య దిగిరావడాన్ని చూస్తే, డీకే సీఎం అవ్వడం దాదాపు ఖాయం అయినట్లు పరిశీలకులు భావిస్తున్నారు. సంక్రాంతికి డీకేకు హైకమాండ్ శుభవార్త అందించనున్నట్లు కూడా రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. డీకేను ముఖ్యమంత్రిని చేస్తే వచ్చే సాధకబాధకాలపై హైకమాండ్ ప్రధానంగా శనివారం చర్చించినట్లు కూడా తెలుస్తోంది. తమ నిర్ణయాన్ని వెల్లడించకముందు మరోసారి ఇద్దరి మధ్య సయోధ్య కుదర్చాలని హైకమాండ్ భావిస్తోంది. ఇరువురి మధ్యా మరో బ్రేక్‌ఫాస్ట్ సమావేశం జరిగే అవకాశం ఉందని అంచనా. అనంతరం ఇద్దరిని ఢిల్లీకి పిలిపించి హైకమాండ్ చర్చించనున్నట్లు భావిస్తున్నారు.



# ఉప్పల్‌లో మెస్సీ నేతృత్వంలోని ఫ్రెండ్లీ ఫుట్‌బాల్ మ్యాచ్ ఏర్పాట్లు పరిశీలన

హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):

ఉప్పల్ స్టేడియంలో ఈ నెల 13న జరగనున్న ఫ్రెండ్లీ ఎగ్జిబిషన్ ఫుట్ బాల్ మ్యాచ్ ఏర్పాట్లను ఆదివారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, అడీషినల్ డీజీ విజయ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ మ్యాచ్‌లో ప్రపంచ దిగ్గజ ఫుట్ బాల్ ఆటగాడు లియోనెల్ మెస్సీ సారథ్యంలోని జట్టు, సీఎం రేవంత్‌రెడ్డి జట్టుతో తలపడనుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ మ్యాచ్‌కు అంతర్జాతీయస్థాయి ఏర్పాట్లు చేస్తున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. ప్రజలందరూ మ్యాచ్ సమయానికి ముందుగానే స్టేడియంకు చేరుకుని పోలీసులకు సహకరించాలని కోరారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. ఫుట్ బాల్ మ్యాచ్ ఆడేందుకు మెస్సీ రాష్ట్రానికి రావడం ఎంతో కీర్తి ప్రతిష్ఠలను తెచ్చిపెడుతుందన్నారు. మెస్సీ రాక తెలంగాణ రైజింగ్ ఉత్సవాలకు మరింత ఊపునిస్తుందన్నారు. ఈ సందర్భంగా స్టేడియం వద్ద భద్రతా ఏర్పాట్లను రాచకొండ సీపీ సుధీర్‌బాబు మంత్రులకు వివరించారు. దేశం నలుమూలల నుంచి భారీగా అభిమానులు వచ్చే అవకాశం ఉన్నందునా.. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులకు మంత్రులు దిశానిర్దేశం చేశారు.

## ప్రధాన రహదారులకు గ్లోబల్ దిగ్గజ కం పెనీల పేర్లు!

హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినూత్న ప్రతిపాదనతో ముందుకు వచ్చారు. ప్రపంచ ప్రఖ్యాత వ్యక్తులు, కంపెనీల పేర్లను హైదరాబాద్ లో ప్రధాన రహదారులకు పెట్టాలని నిర్ణయించారు. ఔటర్ రింగ్ రోడ్ వద్ద రావిర్యాలను నుంచి ప్రారంభమై ప్రతిపాదిత ఫ్యూచర్ సిటీని అనుసంధానం చేసే 100 మీటర్ల గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డుకు పద్మభూషణ్ రతన్ టాటా పేరు పెట్టాలని నిర్ణయించారు.

రావిర్యాల ఇంటర్‌చేంజ్‌కు ఇప్పటికే "టాటా ఇంటర్‌చేంజ్" అని పేరు పెట్టారు. ప్రపంచంలోనే తొలిసారిగా హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ జనరల్ ముందు నుంచే వెళ్లే ప్రధాన రహదారికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరుతో "డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ" అని నామకరణం చేయాలన్న ప్రతిపాదనను ప్రభుత్వం సిద్ధం చేసింది. ఈ నిర్ణయంపై కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖకు, అమెరికా రాయబార కార్యాలయానికి ప్రభుత్వం లేఖ రాయనుంది. మరిన్ని ప్రధాన రహదారులకు గ్లోబల్ దిగ్గజ కంపెనీల పేర్లు పెట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. గ్లోబల్ టెక్ దిగ్గజం గూగుల్ సేవలను గుర్తిస్తూ ఒక ముఖ్య రహదారిని "గూగుల్ స్ట్రీట్" అని ప్రకటించేందుకు ప్రతిపాదనతో పాటు మైక్రోసాఫ్ట్ రోడ్, విప్రో జంక్షన్ పేర్లను కూడా పరిశీలిస్తున్నారు.

# వందేమాతరానికి 150 ఏళ్లు

(మొదటి పేజీ తరువాయి)



కేటాయించారు. అవసరమైతే మరికొంత సమయం కేటాయిస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది.

వందేమాతర గీతం గురించి ఎక్కువ మంది తెలియని విషయాలు, ముఖ్యమైన అంశాలు సభలో ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉంది. బెంగాలీ కవి బంకించంద్ర ఛటర్జీ రాసిన వందేమాతరం గీతానికి 150 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఘనంగా వేడుకలు నిర్వహిస్తోంది. నవంబర్ 7న మొదలైన ఈ వేడుకలు ఏడాదిపాటు కొనసాగుతాయి. ఇందులో భాగంగానే పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ప్రత్యేక చర్చ చేపట్టాలని నిర్ణయించారు.

షెడ్యూల్ ప్రకారం సోమవారం లోక్‌సభలో, మంగళవారం రాజ్యసభలో చర్చ జరుగనుంది. ఎగువసభలో వందేమాతరంపై చర్చను కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రారంభిస్తారు. ఇదిలా ఉండగా, వివాదాస్పద ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) సహా ఎన్నికల సంస్కరణలపై లోక్‌సభలో మంగళవారం, బుధవారం చర్చించడానికి ప్రభుత్వం అంగీకరించింది. ఆ తర్వాత ఈ అంశంపై రాజ్యసభలో చర్చ ప్రారంభమవుతుంది.

# జాతీయ భద్రతకు బలమైన బాటలు



సరిహద్దుల వెంట జాతీయ భద్రతలో తమ ప్రభుత్వ నిబద్ధతకు ఈ నూతన రహదారులే ప్రబల నిదర్శనాలు అని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యానించారు. సరిహద్దు రోడ్లు జాతీయ భద్రతకు జీవనాధారాలని, మెరుగైన అనుసంధానతతో భారీ ప్రయోజనాలు ఒనగూరతాయని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు.

సరిహద్దుల వెంట బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ (బీఆర్ఓ) కొత్తగా నిర్మించిన 125 ప్రాజెక్టులను ఆదివారం ఆయన లేహ్‌లో జరిగిన కార్యక్రమంలో జాతికి అంకితమిచ్చాక ప్రసంగించారు.

లద్దాఖ్, జమ్మూకశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంతాలతోపాటు అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, మిజోరం రాష్ట్రాల్లో మొత్తంగా రూ.5,000 కోట్ల వ్యయంతో సరిహద్దుల వెంట 28 రహదారులు, 93 వంతెనలు, నాలుగు ఇతర నిర్మాణాలను బీఆర్‌వో విజయవంతంగా పూర్తిచేసింది. బీఆర్‌వో చరిత్రలో ఒకేరోజు ఇన్ని ప్రాజెక్టుల ప్రారంభోత్సవం జరగడం ఇదే తొలిసారి. ''సరిహద్దు మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడంలో ప్రభుత్వ నిబద్ధతకు ఇవి ప్రబల నిదర్శనాలు. మన సైనికుల శౌర్యం, ధైర్యం మనకు స్ఫూర్తిదాయకం.

దేశ సేవలో ప్రాణాలను అర్పించిన వీరులకు ఈ మౌలిక సదుపాయాల ప్రాజెక్టును అంకితమిస్తున్నా. అత్యంత అనువైన రహదారులు అనేవి సరిహద్దుల వెంట సైన్యం విజయవంతమైన సైనిక ఆపరేషన్లు చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయి. అద్భుతమైన రోడ్ల అనుసంధానతతోనే చక్కటి సైనిక విజయాలను సాధించగలం. ఆత్మనిర్భర్ భారత్ దార్శనికతకు అనుగుణంగా కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడంతో పాటు షెడ్యూల్ కంటే ముందే పూర్తి చేయడం విశేషం''అని బీఆర్ఓ విభాగాన్ని రాజ్‌నాథ్ పొగడ్తల్లో ముంచెత్తారు.

''సరిహద్దును అనుసంధానం చేయడం, భద్రతను బలోపేతం చేయడమే కాకుండా స్థానిక ఆర్థిక వ్యవస్థలను అభివృద్ధి చేస్తుందని, ప్రకృతి విపత్తుల సమయాల్లో సహాయక చర్యల వేగాన్ని పెంచుతుంది. సాయుధ బలగాలతోపాటు బీఆర్ఓ సిబ్బంది, సరిహద్దు ప్రాంతాల పౌరులు జాతీయ భద్రతలో భాగస్వాములవుతున్నారు. ఇదే స్ఫూర్తిని కొనసాగించాలి''అని ఆయన పిలుపునిచ్చారు. లద్దాఖ్‌లోని దుర్బుక్-శ్యోక్-దౌలత్ బేగ్ ఓల్డీ మధ్య 920 మీటర్ల పొడవునా నిర్మించిన సొరంగం ఇంజనీరింగ్ అద్భుతం అని కొనియాడారు.

''రక్షణరంగ పరిశ్రమలో భారత్ అద్భుతమైన ప్రగతిని కనబరుస్తోంది. 2014లో రూ.46,000 కోట్లుగా ఉన్న రక్షణ ఉత్పత్తుల విలువ ఇప్పుడు రికార్డు స్థాయిలో రూ.1.51 లక్షల కోట్లకు పెరిగింది. రూ. 1,000 కోట్ల కంటే తక్కువగా ఉన్న మన రక్షణ ఎగుమతులు ఇప్పుడు రూ. 24,000 కోట్లకు చేరుకున్నాయి''అని గుర్తుచేశారు. ''2024-25 ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో బీఆర్ఓ రూ.16,690 కోట్ల వ్యయంతో రోడ్లను నిర్మించింది.

2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.18,700 కోట్ల విలువైన మౌలిక వసతుల ప్రాజెక్టులను పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. గత రెండేళ్లలో బీఆర్ఓ 356 మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను జాతికి అంకితం చేయడం, మౌలిక సదుపాయాల అభివృద్ధిలో ఒక మైలురాయి. జాతీయ భద్రతలో బీఆర్ఓ పాత్రను గుర్తించిన ప్రభుత్వం 2025-26లో బడ్జెట్‌ను రూ.6,500 కోట్ల నుంచి రూ.7,146 కోట్లకు పెంచింది''అని చెప్పారు.

## డిసెంబర్ 9ని 'విజయ్ దివస్'గా ఘనంగా
# జరుపుకోవాలని కేటీఆర్ పిలుపు

హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):



తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియలో కీలక ఘట్టమైన డిసెంబర్ 9వ తేదీని 'విజయ్ దివస్'గా ఘనంగా నిర్వహించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం పార్టీ ముఖ్య నేతలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా అధ్యక్షులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షకు తలొగ్గి, కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది డిసెంబర్ 9వ తేదీనే అని కేటీఆర్ గుర్తుచేశారు.

నవంబర్ 29న 'దీక్షా దివస్'ను విజయవంతం చేసినట్లే, కేసీఆర్ 11 రోజుల దీక్ష ఫలించిన డిసెంబర్ 9ని విజయం సాధించిన రోజుగా.. 'విజయ్ దివస్' పేరుతో పండుగలా జరుపుకోవాలని ఆయన సూచించారు. డిసెంబర్ 9న 60 సంవత్సరాల తెలంగాణ ఆకాంక్షకు కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష వల్ల ఒక రూపం వచ్చిందని కేటీఆర్ అన్నారు. అలాంటి ఘనమైన చారిత్రక ఘట్టాన్ని మరోసారి స్మరించుకుంటూ, కేసీఆర్ తెలంగాణ కోసం చేసిన త్యాగాన్ని గుర్తుచేస్తూ, ప్రత్యేక రాష్ట్ర ప్రకటన వెలువడిన రోజును సంబరంగా నిర్వహించుకోవాలని సూచించారు.

నియోజకవర్గ కేంద్రాల్లో కార్యక్రమాలు..

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అందరూ బిజీగా ఉన్నందున, గ్రామాల్లో కాకుండా కేవలం నియోజకవర్గ కేంద్రాల్లో మాత్రమే విజయ్ దివస్ కార్యక్రమాలను నిర్వహించాలని కేటీఆర్ స్పష్టం చేశారు. 'నియోజకవర్గ కేంద్రాల్లోని తెలంగాణ తల్లి విగ్రహాలకు పాలాభిషేకం చేయాలి. డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించాలి. ప్రభుత్వ ఆసుపత్రులలో రోగులకు పండ్లు పంపిణీ చేయాలి.

పార్టీ కార్యాలయాల వద్ద లేదా ప్రధాన కూడళ్లలో విజయానికి సూచికగా పింక్ బెలూన్లను గాలిలోకి ఎగురవేయాలి'అని కేటీఆర్ పేర్కొన్నారు. కాగా, కేసీఆర్ దీక్ష ఫలవంతమైన నిమ్స్ ఆసుపత్రిలో, అలాగే గాంధీ ఆసుపత్రిలో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో పండ్ల పంపిణీ కార్యక్రమాలు జరుగుతాయని కేటీఆర్ తెలిపారు. పార్టీ నగర నాయకత్వం ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు.

Printed, Published and Owned by B.PRAMOD KUMAR, B258, Phase1, Vanasthalipuram, Hyderabad70. Printed at Garuda Printers, Plot No.91, Sri Ramnagar Colony, Kharmanghat, Hyderabad500035, Telangana. Published at H.No. B258, Phase1, Vanasthalipuram, Hyderabad500070, Telangana. Editor: N.Ramakrishna Reddy, email: citytimestd@gmail.com, RNI: APTEL/2001/5896